Andhra Dramas

AND

Andhra stage.

BY

TEKUMALLA ACHYUTA RAU M. A., L. T.,

"The true philosophy of the Drama lies in its being an imaginative imitation of life."

(H. Reed.)

The Chintamani Printing Works,
RAJAHMUNDRY.
1926.

[All rights reserved.] [Price As. 0-6-0.

BOOKS BY THE SAME AUTHOR.

1. Andhra Songs and Ballads. (Telugu.)
   0—4—0.

2. History of the Telugu Literature in the Vizianagaram Empire Part I. (Telugu.
   (in print.)

3. Life and Works of Pingali Suranarya, being a Comprehensive and Critical History of the life and works of the grea poet. (English.)
   (in print.

☞ Copies can be had from the Author.

Rajahmundry.

ఆంధ్రనాటకములు,

రంగస్థలములు.

గ్రంథకర్త

పేకుమళ్ల అచ్యుతరావు, యమ్. ఎ., యల్. టి.,

"త్రైలోక్యస్యాస్య సర్వస్యనాట్యం భావానుకీర్తనం"

(భరతముని:-నాట్యశాస్త్రము.)

(మొదటికూర్పు 500 ప్రతులు.)

శ్రీచింతామణిముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

రాజమండ్రి.

1926

సర్వస్వామ్యసంకలితము.]

[వెల అ. 0—6—0.

DEDICATED

TO

MY FATHER

TEKUMALLA KAMAYYA GARU

Born 1839 [Circa]-died 3—4—1899

Simple and innocent in life
He cared for others than his own;
But God in recompense has shown
His Mercy to his childr'n and wife.

నాతండ్రియగు

టేకుమళ్ల కామయ్యగారికి

అంకితము చేయఁబడినది.

జననము 1839 మరణము 3—4—1899.

తే. గీ. మాయయును మర్మమెఱుఁగక మనుచుఁ దన్ను
మాలినిచ్చలు నితరుల మేలెగోరె ;
దేవదేవుండు ప్రత్యుపకృతిగా యొసఁగఁ
పత్నీసుతులకపారదయను జూపె.

పీ ఠి క.

ఈగ్రంథమందలి మొదటియధ్యాయమును ప్రసిద్ధ నాటక వాఙ్మయాభిమానియగు పురాణం సూరిశాస్త్రిగారి ప్రోత్సాహముచే 1926 సం॥లో వ్రాసి కృష్ణాపత్రికలోఁ బ్రచురించితిని. తరువాతఁ గొన్ని వత్సరములవఱకు పింగళి సూరనార్యకవి జీవితరచనానిమగ్నుఁడనై యీనాటకగ్రంథవిషయమును గట్టిపెట్టితిని. ఇటీవల "సారస్వతసర్వస్వము" పత్రికాధిపతియగు ఏలూరుపాటి రామభద్రచైనులుగారు తమ పత్రికకుఁ గొన్నివ్యాసములనుఁ బంపుడని కోరగా మూడవ అధ్యాయభాగము వ్రాసి వారిపత్రికకుఁ బంపితిని. నాల్గవ యధ్యాయ మాంధ్రసాహిత్య పరిషత్తులోఁ జదువబడినది. గ్రంథమునుఁ బూర్తిచేసెడు తలంపుతో మిగిలిన రెండధ్యాయములను రచించి యన్నిటిని పుస్తకరూపమునుగాఁ బ్రకటించితిని. ఈగ్రంథమందేదైన సుగుణలేశమున్నయెడల సరసులు గ్రహించి సంతసించిన నాశ్రమయంతయు సార్థకమైనదని తలంచెద.

నేను గ్రామాంతరము వెళ్ళినకాలములో మొదటి రెండధ్యాయములు ముద్రింపబడుటచే బుజువు పత్రములు [Proofs] సరిగదిద్దుటకు వీలులేక కొన్ని అచ్చుతప్పులుండిపోయినవి. వానినన్నిటిని శుద్ధపట్టికలోఁ జేర్చితిని. సుహృదయులు లోపములను క్షమింతురుగాక.

ఆంగ్లభాషయందు త్తీర్ణులయ్యు, గీర్వాణాంధ్రభాషల యందు మహాపండితులై, బహుగ్రంథసంపాదకత్వమునఁ జిర కీర్తిఁ గడించిన బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవి ఎమ్. ఎ. గారు నాట్యశాస్త్రమున కాదిమఋషియనదగు భరతముని నాట్యశాస్త్రమును ముద్రింపించుచూ నాయీచిన్నగ్రంథము నాదరించి ప్రస్తావన వ్రాసినందుకు నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

కోరినవెంటనే తనయభిప్రాయమును వ్రాసి నాకుఁ బంపిన మదీయ స్నేహితుడగు విద్వాన్ గరిమళ్ళ సోమన్నశాస్త్రులు ఎమ్. ఎ., యల్. టి., గారికి నాకృతజ్ఞతాభి వందనములనర్పించుచున్నాను. వారిచ్చిన యుదారభావస్ఫురితమైన యుత్కృష్టాభిప్రాయము నీగ్రంథమున సాదరముగ జేర్చితిని.

ఇట్లు,

24—6—1926,
రాజమహేంద్రవరం

విద్వజ్జనవిధేయుడు,
కే. అచ్యుతరావు.

గ్రంథప్రస్తావన.

నాటకలక్షణప్రతిపాదక మగునీచిన్నగ్రంథము పింగళి సూరనాదికవికావ్యవిమర్శన ప్రఖ్యాతులై యాంధ్రలోక మునఁ జిరపరిచితులును విశేషించి మాకుఁ జిరకాలమిత్రులు నగు బ్రహ్మశ్రీ పేకుమళ్ళ అచ్యుతరావుపంతులు ఎం. ఏ., ఎల్. టి., గారు రచించి బహుపత్రికాముఖముల ననుదినము వెలువడు నాటకతత్త్వప్రకటనములలోఁ గలవివాదగ్రంథులఁ జాలవఱకు భంజించి సహృదయలోకమునకు సమర్పించుట యెల్లర కామోదకరము. ఆంధ్రభాషలో నాటకలక్షణగ్రంథ ములు లేకుండుటయు, సంస్కృతములో భరతాదిమహామతుల యాశయములు సంపూర్ణముగా నేభాషలోఁగాని ముద్రణావ స్థకు రాకుండుటయుఁ గొన్నిశతాబ్దులుగా భరతఖండమున నాటకప్రదర్శనవిద్య శాస్త్రసమ్మతముగాఁ గాక యథాదేశ కాలసౌందర్యముతో నగతికశరణ్యముగా విలసిల్లుచున్నను దెనుఁగుభాషలో నదియుఁ గానరాక ఖండాంతరవాసుల పరి చయదోషముచేఁ దద్గ్రంథప్రణాళికల ననుసరించి యనుదినము ప్రభవిల్లుచున్న నాటకసముదాయ మక్కడక్కడ క్లేశభూయిష్ఠ ములగుచు మనస్విజనములకు హృదయసంవాదమును సమగ్ర ముగాఁ గలిగింపనేరక విషమసమస్యోత్పాతములకు జన్మభూమి యగుచుండుటవలనఁ గవికర్మముననో నటకౌశలముననో లేక

సభాసదుల యధికారసంపత్తిలోనో లేక నీనివిషమునకూ వేశమునకో జనించినలోపము లెట్టివో యవి యెట్లు పరిహరణీయములో పండితులు చర్చించి నిర్ణయింపక మగు కావ్యసుధారసము దృక్ఛ్రోత్రములఁ గ్రోలజూచుట యాశ్చర్యము కాదు. ఈచిన్నగ్రంథము "ఆంధ్రనాటకములు" అని పరిమితార్థక నామము ధరించినను లోనఁ బరిశీలింప నాటకతత్త్వమున గ్రంథి స్థానముల భేదించు విమర్శగ్రంథమై "నాటకతత్త్వసారము" అనునామమునకుఁ దగియున్నది. ఇందు స్థూలముగా నాటకతత్త్వము, కథానిర్మాణము, పాత్రముల శీలప్రతిష్ఠాపనము సుఖాంతదుఃఖాంతవిభాగవిచారము, ప్రదర్శనశక్తి యను నైదంశములు చర్చింపఁబడినను ప్రసంగవశముగా నేఁటికాలపు వివాదాంశము లన్నియుఁ బరిష్కరింపఁబడినవి. పైనైదంశములలోఁ గడపటి రెండును ముఖ్యముగాఁ గడగొట్టుది కేవల మేకదేశమై దేశకాలోపాధిచే బాధితమగుటచే నేఁటికాలము లోని యాంధ్రనటసంఘముల కౌశలము నే ప్రతిపాదించి గ్రంథనామమును సార్థకము చేసినను మొదటిమూఁడు విచారములు నాట్యశాస్త్రమూలతత్త్వము నే ప్రతిబోధించును. నాటకము లోకస్వభావమునకుఁ బ్రతిబింబప్రాయ మయ్యును లోకమువలెఁ గాక రంగప్రదర్శనము క్షణకాలములో నే యాథ్యాత్మపరిపాకమును గల్పించి దేహిని బరిశుద్ధుఁగాఁ జేయుటయె నాటకోద్దేశ మని నీరు స్థాపించుట ధర్మప్రతిష్ఠాపకు లగు మహర్షుల ముఖ్యోపదేశమునకు భిన్నప్రస్థానము గా నేరదు.

నాటకములు కేవలము భావనాజన్యములే కాని, యనఁగా విన్తకృత్రిమాదిరూపములే కాని, ప్రకృతికి సంపూర్ణముగా సత్యప్రతిబింబములు కావు అని వీరు సిద్ధాంతీకరించిరి. భరతాదులు శృంగారాదిరసములుసహిత మలోకసిద్ధము లగునానంద విశేషము లనియుఁ బ్రమాణజ్ఞులు భాషాప్రయోగమంతయు శబ్దార్థముల రెంటను కేవలము కృత్రిమ మనియే ప్రతిపాదించిరి.

నాట్యప్రదర్శనము కేవలము లోకమునకుఁ బ్రతిబింబ మని తలఁచువారు గీతరచనయుఁ బద్యరచనయు రసపోషణమునకుఁ బ్రకృతిసిద్ధములౌ వాని నెల్ల పరిహరింపఁగూడ దను విప్రతిపత్తిని గ్రహించి పద్యగీతరచనలు రెండును బరమార్థముగ రసపోషకములే యని గ్రంథకర్త నిర్ధారించెను. అభినవగుప్తాదినాట్యవేదవ్యాఖ్యాతలీ మూఁడంశముల నిట్లే పరిష్కరించిరి.

భాషాభేదము పాత్రభేదము ననుసరించిన యెడల సర్వమవ్యవస్థ మగు నని సూచించి జాత్యాచారపదవీప్రవృత్తుల కనుగుణముగా నాంధ్రభాషలోనే వాక్యరచన గూర్పవచ్చు నని సిద్ధాంతము చేసి భాషారచనయు నాట్యధర్మములలోఁ జేర్చి పంతులవారు నాటకలక్షణాంతర్హిత మగు యథార్థతత్త్వమును వ్యక్తపఱచిరి.

ఇఁకఁ గథానిర్మాణవిచారమున నాంధ్రభాషలోని శిష్టగమనికలఁ జర్చించి ఐతిహాసిక కథాశరీరములఁ బ్రవర్తిల్లు

నమానుషస్వభావవర్ణనములకు లోకాభిప్రాయప్రవాహసిద్ధ మగు రూపమునే గ్రహింపవలయు నని మునిమతమే ప్రతిపాదించిరి. ప్రసంగవశముగా నాటకములు సభాసదులయాంతర సంస్కారమున కనుగుణముగా నుండవలయు నని శాసించిరి. ఇది చాల జటిలప్రశ్నము. లోకము భిన్నరుచిక మగుటచేఁ గథారుచి కనుగుణముగా నధికారసంపత్తి గల సామాజికులే చూడవత్తురు. నాటకసుఖసిద్ధికిఁ గేవలము కవి, నట, గాయక, వాదక, జవనికాసామగ్రులే కాక సభ్యులసంస్కారపటిమయుఁ దోడ్పడు ననువిచారమునకుఁ దొడఁగుటలో నేఁటికాలపు విమర్శకులలో వీరే ప్రథము లగుదు రేమో.

శిల్పప్రతిష్ఠాపన మను మూఁడవవిచారము చాల సుందరముగా సంఘటింపఁబడియె. నీరసములు నిరుపయోగములు, నిమ్నపాతనములు నగు వస్తుశరీరములఁ బరిగ్రహింపక యుదాత్తగుణసౌందర్యవ్యక్తీకరణమే మానసాంతఃకరణ మాలిన్యముఁ దొలఁగించి ధర్మాదిసాధనోపాయ మగుచుఁ గృతార్థతా పరిగ్రాహక మగు నని వీరు ప్రతిపాదించిరి. అవాంతరప్రసంగముగాఁ బాత్రగుణముల నూరక పేర్కొన్నం జాలదని భరతాదులు ప్రకారాంతరమునఁ జతుర్విధాభినయసాధనము లని పేర్కొన్న భావభావనారూప మగు పాత్రగుణ వ్యక్తీకరణము శ్రేష్ఠ మని సిద్ధాంతము చేసిరి. పురాణగాథల గ్రహించినపుడు లోకప్రవాహసంసిద్ధ మగు గుణౌచిత్యమునే పోషింపవలయు నని ప్రతిపాదించుటయు మహర్షుల యాశయమే.

పాశ్చాత్యులనది యగు సుఖాంత దుఃఖాంత నాటకవిభాగ విధానము సరియైనదియనుట పరమార్థమున నాట్యాచార్యులతోఁ గలసినను నాసాంతముగ విషాదాంత ప్రదర్శనము మునిసమ్మతము గాదేమో. అట్లయినను భాసాదుల యూరుభంగాది నాటకములు నిక్కముగా విషాదాంతములే. సుకుమారజనమనఃక్లేశకరము లయ్యును విషాదాంతనాటకములు మహోన్నతులకు మాత్రము తప్పక తీవ్రప్రబోధ కారణము లని గ్రంథకర్తతో సంగీకరింపవలసివచ్చును.

నాటకప్రదర్శన మనునదె దవవిచారము కేవల మాంగ్లనాటకరంగములకే నవీనకాలమునకే చెల్లుచున్నందున ఇప్పుడది మాతృగౌరవప్రతిపత్తులకే తావల మగును.

పై చేసిన విచారము లన్నియు నాటకతత్త్వవిమర్శనమునకు జీవాతువు లగు ఘట్టములు. ఈ గ్రంథము కేవలము సూత్రప్రాయము గా నుండదగు. దీనిలో నాటకీయాంశము విస్తరింపబడక యుండినను గ్రంథబాహుళ్య మైనను సామాన్యజనుల కెక్కువయుద్బోధకముగా నుండును. అస్థిస్థానీయములగు నటువంటి నాట్యవిచారములను సోదాహరణముగా మనమతోపోద్బలముతో విస్తరించి ప్రౌఢ మగు నాకృతి యొసంగినచో నీగ్రంథము మిక్కిలి రమణీయమగుటయేకాక ఆంధ్రనాటకవిమర్శసోపానపరంపరలో నుపేక్షింపఁజాలని మెట్టగు నని స్పష్టముగాఁ జెప్పవచ్చును. గ్రంథకర్తలు వాక్యరచనా మర్యాద ననుసరించి సర్వజనసుకరముగా నీ గ్రంథమును రచించిరి. ఇది యెల్లరకు నిష్పక్షపాతముగఁ బ్రబోధకారి యగునని తలంచుచున్నాను. ఈవిచార

పరంపరను వీరు స్వబుద్ధితోడనే నాటకతత్త్వమును తరించి ప్రకటించినను నాట్యాచార్య సిద్ధాంతములతోఁ బెక్కువిషయముల నేకీభవించుట వీరి ప్రతిభకు మెఱుఁగు తెచ్చుచున్నదని యట్టి ముఖ్యాంశముల నిందుఁ జేర్కొంటిని.

ఈ పూర్వవిజ్ఞప్తి నన్ను రచింపు మని పంతులవారు నన్నుఁ గోరుట వారికి నాయందుఁ గల మైత్రిప్రతిపత్తికి సాక్షీభూత మగుచున్న దని నా యంతరాత్మ యానందించినను దీనిలో నున్న గుణముల నించుక స్పృశించి చూపుట తదానంద జన్యము కాక కేవలము నాట్యశాస్త్రపరిశీలన క్లిశ్యమాన ప్రతిభాలవవిశ్రాంతికారణ మనియే సత్యోక్తి గ్రహింతురు గాక యని పండితులఁ బ్రార్థించుచున్నాఁడను.

రాజమహేంద్రవరము,
24 జూన్ నెల 1926. మా. రామకృష్ణకవి.

పండితాభిప్రాయములు.

:0:

విద్వాన్ గరిమెళ్ల సోమన్న పంతులు ఎమ్. ఏ., ఎల్. టి., గారు:

"శ్రీ కొక్కుమళ్ళ అచ్యుతరావుపంతులు ఎం.ఎ.,ఎల్.టి., గారు రచించిన యీ ఆంధ్రనాటకములు అను విమర్శగ్రంథమునందు నాటకముల ప్రయోజనములును ప్రదర్శన పద్ధతులును ఇప్పటి తెలుఁగునాటకముల గుణదోషములును వి... లసుగను వివేకముతోడను చర్చింపఁబడినవి. నాటకము... వ్రాయువారును నాటకముల నాడువారును నాటకములను...

చూచునాఁగనుగూడ ఈచిన్నపుస్తకమును జదివి లాభమును పొందఁగలరు. తెలుఁగునాటకశాలలకు క్రొత్తత్రోవఁజూపిన ఆంగ్లసంస్కృతి నాటకముల రీతు లిందు ప్రాస్తావికముగ నుగ్గడింపఁబడినవి.

మానసచిత్తప్రవృత్తులను శుద్ధపఱచుటయే నాటకముల ముఖ్యోద్దేశ్యమనియు, నాటకరచనకు పద్యశైలి ఎక్కువగ నొప్పదనియు, వైదేశిక పాత్రములకు ఆయాపదవులకు దగినటుల తెలుఁగునే ఉపయోగింపవలయు ననియు, చరిత్రాత్మకమగు నాటకములు ఎక్కువగ వెలువడవలసియున్నవనియు, దుఃఖాంతనాటకములను నిషేధింపరాదనియు, పరాయిమూన్నగు లాసంగీతాలాపనములును సాంప్రదాయవిరుద్ధములగు యవనికాచిత్రాదులును అప్రస్తుతముగనుపకు తగినవి కావు, పద్యములు రాగయుక్తముగ వచింపఁబడవచ్చుననియును, హత్యాది ఘోరనిత్యదర్శనములు కూడదనియును శ్రీ అచ్యుతరాఘవసంతోషులుగారు ఈపుస్తకమున ఆయాప్రకరణములలో తెలియఁజేసిరి. కేవల వచనరూపక నాటకములు నేఁటికి సమ్మానములు కాస్తు కాని ఇంకముందు ఇట్టివియే విశేషముగ రానున్నవి. ఔన్నత్యమునున్నగు ఆంగ్లకవులు వచననాటకములచే వాసికెక్కుచున్నారు. నాటకమునకు వచ్చువారిలో నూటికి తొంబదిమంది భాషావిషయమున ప్రౌఢులయియుండరు. కట్టివారికి పద్యముల భావములు ఒకపట్టున స్ఫురింపవు. గద్యప్రధానగనాటకములు అప్రయత్నముగ గ్రాహ్యములగును. నాటకగ్రంథములను పాఠకులు బాగుగ చదువుకొని చిత్రప్రదర్శనమును చూచుటకే నాటకశాలకు రావలయునని

కోరలేముగదా. ఉదాత్తభావములు వచనరూపకముగను గూడ తెలుపవచ్చును.

సంస్కృతములోఁ దప్ప తక్కిన పాశ్చాత్య భాషలలోఁ దుఃఖాంతనాటకములు ఎక్కువగ గలవు. కావలసినన్ని ఘోర విపత్తులను మన మీప్రపంచమునందనుభవించు చున్నాముగదా. వీనివలన మనకు సౌహార్ద్రసామ్రాజ్యాభివృద్ధి కాదా. తిరిగి దృశ్యకావ్యప్రపంచమునఁ గూడ ఇట్టి సంతాప కారణంబులను గన మన మేల అపేక్షింపవలయును? భాషా విషయమున ఇట్టి దుఃఖాంతనాటకములకు ప్రసక్తి లేకపో లేదు. చరిత్రకావ్యము నవలలు మున్నగు శ్రవ్యకావ్యములు వీనికిఁ జాలును. దృశ్యకావ్యములచే ఈ వైపరీత్యములను ప్రత్యక్షపఱుచుట మేలా? సుఖాంతనాటకములు తృప్తియు, పుష్టియు, తుష్టియు నొసంగునే. ఇట్టిభావములు అచ్చటచ్చట వినఁబడును.

శ్రీ అచ్యుతరావుపంతులుగారు ఆంధ్రదేశమునందలి ముఖ్యరంగస్థలములను తెన్నుగ పరికించియున్నారు. ఆంగ్లమును ఆంధ్రసంస్కృతములను వీరు ఉత్తీర్ణులు. వీరి ఆశయములు ఆదరణీయములు.

ఇట్టి విమర్శగ్రంథములు వీరు ఎక్కువగ ప్రకటించి ఆంధ్రమునకును ఆంధ్రులకును మేలొనరింతురుగాక.

విజయనగరము,
14 మే 1926.

గ. సోమన్న.

ఆంధ్ర నాటకములు

1 నాటక తత్త్వము.

శ్లో॥ "నాట్యం భిన్నరుచేర్జనస్య
బహుధా ప్యేకం సమారాధనమ్"

(కాళిదాసు.)

ఆంధ్రనాటక విషయములను గుఱించి యనేక మహానీయు లనేక విషయముల నిదివఱకు వార్తాపత్రికలమూలమున వెల్లడిపఱచియున్నారు. సామాన్యముగా నాటకముల ముఖ్యోద్దేశ మెద్దియో; నాటకములు వ్రాయుటలో ప్రాయశః వచనశైలియా, పద్యశైలియా, ప్రకృతిసిద్ధ మధియు; ఉభయశైలులను వాడుక చేయవలసిన దో నేది యెంతవఱకు నుపయోగింపవలసియున్నదియు; ఏయే సందర్భముల గద్యపద్యములు స్వాభిసిద్ధము లగుననియు; ఇత్యాదివిషయములును, మఱియు భాషావిషయమున పాత్రముల కుచితమైన భాష నిర్ణయించుటయందే యే సంగతులను ముఖ్యముగా మనము జ్ఞప్తియందుంచుకొనవలయుననియు, పాత్రపోషణ కాలనిర్ణయాదుల నెట్లు చేయవలసియున్నదియు మున్నగువిషయములు వెవ్వేఱభిప్రాయములకు హేతుభూతము లగుచున్నవి. ఈవిషయములను

గూర్చి నేనును నాకుఁ దోఁచిన సంగతుల నిక్కడఁ బొందు పఱిచెద.

మానవజీవితాదర్శములు మానవకోటికి స్వభావసిద్ధముగను సోదాహరణముగను గనఁబఱచి మానవచిత్తప్రవృత్తులను శుద్ధిపఱచుటయే నాటకముల ముఖ్యోద్దేశము. ఇతిహాసపురాణాదులనుండికాని, చరిత్రములనుండికాని, భూతభవిష్యద్వర్తమాన సాంఘిక బృందములనుండికాని కవికల్పనలనుండికాని మహనీయుల చరిత్రములను నిరూపించి తత్తద్వ్యాపారేతివృత్తములను మనకన్నులయెదుట నడపించి మన మనస్సులను రసభరితములుగఁ జేసి శుద్ధమగు జీవితాదర్శములను దెలుపుటయే నాటకముల ముఖ్యోద్దేశము. మానవజీవచరిత్రములే నాటకములకు ముఖ్యాధారము లయ్యును నాటకములు కేవలము మానవ జీవచరిత్రములు కావు. జీవచరిత్రములలో నాయావ్యక్తులు వారివారి జీవితములయందు జన్మప్రభృతి మరణపర్యంతము చేసిన కార్యములను కాలానుక్రమముగా రచింపఁబడును. గ్రంథకర్త యెంతమాత్ర మాకార్యక్రమమును మార్చుటకు వీలు లేదు. నాటకము లన్ననో యాదర్శప్రధానములు గావునఁ గార్యక్రమము నోకించుక మార్చినను మార్పవచ్చును; నూతనపాత్రములను జేర్చినను జేర్పవచ్చును. లక్ష్యముగాఁ జేసికొనిన యాదర్శనములను నిరూపించుటయే ప్రథమకర్తవ్యము,

అనేకశతాబ్దములలోఁగాని యనేక సంవత్సరములలోఁగాని లేదా యనేకదినములలోఁ గాని జరగిన యితివృత్తములను మనకన్నులయెదుట మూఁడు నాలుగు గంటలలో జరుగునట్లు కనుపఱుపవలసియున్నది. ముఖ్యాంశములనే తీసికొనినను కాలపరిమాణము చాలఁదక్కువగా నుండును గాన ప్రేక్షకులు దమభావనాశక్తినైపుణిచే లుప్తభాగములను బూర్తిచేసి కథనంతయుఁ దదాదర్శనములను ద్యోతకము చేసికొనవలయును. ఈసంగతినే షేక్స్పియర్ మహాకవి యిట్లు నుడివి యున్నాఁడు:—

"The best in this kind are but shadows—and the worst are no worse if imagination amend them.

చాలకాలమునందు జరిగిన సంగతులను కొలఁదికాలములో జరిగినట్లు నిరూపించుటచే మనము కాలప్రకృతికి కొంతవరకు వ్యతిరేకముగా నడచుచున్నాము. వేఱు వేఱు దేశములయందును వేఱు వేఱు స్థలములయందును జరిగినయంశముల నొకటేస్థలములయందు నిరూపించుటచే దేశప్రకృతికి వ్యతిరేకముగా నడచుచున్నాము. మఱియు నాయాచరిత్రాంశములు, మొట్టమొదట జరిగినప్పుడే యేపురుషులును స్త్రీలును జీవించియుండిరో, వారందఱును గతించినను వారిస్థానములయందు కొన్ని నూతనపాత్రములను గల్పించి యాయా యాఖ్యాయికలను మరల గోచరింపఁజేయుటచేఁ బురుషప్రకృతికి వ్యతిరేకముగా నడచుచున్నాము. ఇట్లు దేశకాలపాత్రములన్నిటియందును మనస్వకపోలకల్పనలచే నూతనసృష్టిఁ జేయు

చున్నాము. కావున నాటకములు భావనాజన్యములు కాని ప్రకృతి జన్యములు కావు. ఇవన్నియు భాషానాప్రతిపాద్యము లగునప్పుడు పాత్రములు మాట్లాడెడు భాషమాత్రము భాషానాప్రతిపాద్యము కాఁగూడదా?

నాటకములయందు వాడుకొనెడిభాష మనుష్యులు సామాన్యముగా మాట్లాడెడు భాషవలె వచనరూపముగా నుండవలెనుగాని, పద్యరూపముగా నుండఁగూడ దని కొందఱి యభిప్రాయము. వచనరూపముగా మాట్లాడుట మానవస్వభావముగాన నాటకములకుఁగూడను వచనమే యుండవలె నని వీరిసిద్ధాంతము. ఈసంగతిని గురించి యించుక విచారింతము.

మనుష్యులు మాట్లాడెడుభాష సాధారణముగా వచనరూపముగా నున్నను భాషాశైలి కొన్ని కొన్ని సమయముల యందు పద్యరూపము ననుగమించుచుండుట యెల్లరకు విదితమే. ఎట్లనఁ గోపము, శోకము, మోహము, విశ్లేషము, మొదలగు మనోవికారములను, హృదయస్పందనములను, వెల్లడిపఱచునపుడు మనుష్యుల భాషాశైలి లక్షణరహితమైన పద్యశైలిగా నుండు నని చెప్ప నొప్పు. మనయాదిమకవియగు వాల్మీకిమునియొక్క కోపస్ఫూర్తియేకదా ప్రథమ పద్యముగాఁ బరిణమించినది.

శ్లో॥ మా నిషాద ప్రతిష్ఠాం త్వగమః శాశ్వతీః సమాః ।
యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితం ॥

కావున రసవికాసమునకొఱకు భాషాశైలి మాఱుచునే యుండును. రసజన్యములే సంగీతమును, కవనమునుగాన రసోత్కర్షమూలములుగా నాదస్యోద్బోధనము చేసెడు నాటకములయందు కవిత్వ, సంగీత, సాహిత్య సాహచర్య మేల గూడదు ? ప్రేక్షకులమనంబుల గొప్ప యాదర్శములం బలముగా నాటుకొనుటయే నాటకముల ముఖ్యోద్దేశము గాన నాయుద్దేశము నెఱవేర్చుట కనుకూల మగు సాధనము లన్నియు కర్తవ్యములే కవన నైపుణియు, గాన చమత్కృతియు, రంగస్థలాలంకృతియు, మున్నగు రసపోషణ విశేషము లన్నియు తగు సాధనములే, ఆకారణముననే కదా మహాకవి కాళిదాసిట్లు చెప్పినాఁడు.

శ్లో॥ఆపరితోషాద్విదుషాం, న సాధు, మన్యే ప్రయోగవిజ్ఞానం
బలవదపి శిక్షితానా మాత్మన్యప్రత్యయో చేతః॥

రసపోషణ సంవిధానము సాధనము; ఆదర్శము సాధనీయము. సాధనసామగ్రియం దుత్తమము కవితామాధుర్యము. కావున నాటకరచనయందుఁ గవితామాధుర్యద్యోతకంబగు పద్యశైలియే ప్రధానము తత్కారణముననే సమస్తదేశంబులయందును మహాకవులు, నాటకములయందుఁ బద్యశైలినే యుపయోగించిరి. అయిన నక్కడక్కడ వచనభాగములుండవచ్చును. రసోత్పత్తికిఁ బ్రధానములు కానిచోటులయందు కథాక్రమమున కనుబంధములుగానుండు తావులయందును నీచపాత్రములు సంభాషించెడు పట్టులయందును

ములగు స్థలములయందు వచనశైలియే యుండఁదగిన దని తోఁచుచున్నయది.

సంస్కృత భాషయందుఁ దప్పఁ దదితరభాషలయందు అనగా, లాటిన్, గ్రీక్, ఫ్రెంచి, జర్మను, మొదలగు భాషల యందు రచింపఁబడిన నాటకములలో స్త్రీలుసహితము పద్యశైలినే మాట్లాడుట యాచారము. సంస్కృతభాషయందు మాత్రమె స్త్రీలు పద్యశైలిని మాట్లాడఁ గూడ దని విచిత్రనియమము విధింపఁబడుట పరిశోధనీయమయిన సంగతి యయినను ప్రస్తుతాంశము కాదు కావున విపులవిచారణ చేయక విడువఁబడినది.

నాటకములయందు పురుషులును స్త్రీలును, సమాన ప్రాముఖ్యమునకుఁ బాత్రము లగుపాత్రములే. నాయకుఁ డెంతమాననీయుఁడో నాయికయు నంతమాననీయురా లనియే నానమ్మకము. తపోత్కర్షమునకును అదర్శసూచనకును నాయకుని వేషభాషావర్తనము లెంతముఖ్యములో నాయికయొక్కయు వేష భాషా వర్తనము లంత ముఖ్యములే; నాయకుని పాత్రపోషణ మెంతకర్తవ్యమో నాయికయొక్కయు పాత్రపోషణ మంతే కర్తవ్యము. అట్టితఱి రసోద్రేకమును నగు కవితామధురిమ నాయకునకేకాని, నాయిక, కనావశ్యకమని చెప్పుట కేవల మన్యాయము. ఉభయుల ముఖముల యందును, గాన విలసిత నృత్య పద్య ప్రవచన చమత్కృతి సమానముగాఁ దాండవము చేయనొప్పు.

ఆంధ్రనాటకములయం దాంధ్రేతరపాత్రము లెట్టిభాషను మాట్లాడవలె నని యిటీవల కొంతచర్చ జరుగుచున్నది. అనఁగా తురకలు మనరంగస్థలములందు మాట్లాడునప్పుడు యెటువంటిభాష మాట్లాడవలయునో యాంగ్లేయులు,మనరంగస్థలముయం దున్నప్పు డెట్టి భాష మాట్లాడవలెనో, మొదలగు సమస్యల్లు, నిర్వచనముచేయఁబడుచున్నవి. ఈసమస్యలను గుఱించివ్రాసినవారందఱేకగ్రీవముగా నొక్కసంగతి మాత్రమంగీకరించిరి. అదేదన;--ఆంధ్రనాటకములయం దేయేజాతి వారు వచ్చినను,ఆంధ్రభాషనె మాట్లాడవలయును గాని, యితరభాషలను మాట్లాడఁగూడ దని సిద్ధాంతము చేయఁబడినది. లనగా తురకలు కేవలము,తురకమే మాట్లాడఁగూడ దనియు, ఆంగ్లేయులు, ఇంగ్లీషుభాషను మాత్రమే మాట్లాడఁగూడదనియు, ఫ్రెంచివారు ఫ్రెంచిభాషనుమాత్రమే మాట్లాడఁగూడదనియు, వీరందరు తెలుఁగుభాషయందేమాట్లాడవలయుననియు నందఱు నమ్మతించిన విషయమె. అయినను వీరందఱు మాట్లాడెడి తెలుగుభాష యెట్లుగా నుండవలెను? ఇందునుగుఱించి వేఱువేఱభిప్రాయములను వేఱువేఱు రసజ్ఞులు వక్కాణించిరి. ఏయేజాతివారు, మన తెనుఁగు నెట్లెట్లుమాట్లాడుదురో యాయా విధమయిన పరిభాషనే మాట్లాడించుట స్వాభావికముగానుండు నని కొందఱిమతము; అనఁగా తురకలు తెలుగు మాట్లాడునప్పుడు వ్యాకరణము నందును, ఉచ్చారణ మందును ఏవిధమయిన వైచిత్ర్యములను గనుపించెదరో, ఆవైచి[illegible]ముల

తో గూడ తురకలపాత్రములు ధరించెడు వారిచే మాట్లా డించుట స్వభావసిద్ధమని వారియభిప్రాయము. అలాగున అం గ్లేయులు తెలుగు మాట్లాడునప్పుడు యేయేయేయుపంటి పారిభాషిక ములను, అపభ్రంశముల నాభాసముల నుచ్చరించెదరో, వానిని జాగ్రత్తగా సేకరించి, నానావిధమైన యాంధ్రభాషను రంగ స్థలములయందు మాట్లాడించుటయే యుక్తమని వీరిమతము. ఈలాగుననే ఫ్రెంచివారును, జర్మనులును, జపానువారును, పాత్రములగునప్పు డనుష్ఠింపవలయును.

ఈవిషయమును గూర్చి మరియొకరు వ్రాసిన యభి ప్రాయ మేదన;--కొన్ని ప్రాంతములలో నున్నతురకలు స్వచ్ఛ మయిన యుచ్చారణతో వ్యాకరణయుక్తముగు తెలుగు మాట్లాడుట యున్నది గాన, తురకలు రంగస్థలమునందు శుద్ధ మయిన తెలుగును మాట్లాడుట కర్హులు. అటులనె కొంతమంది యింగ్లీషువారు శుద్ధమయిన తెలుగు నేర్చుకొని బ్రౌనుదొర గారివలె తెలుగునందుఁ గవిత్వము చెప్పుటకును సమర్థులుగా నున్నారు గాన యింగ్లీషువారునుగూడ శుద్ధమైన తెలుగును మాట్లాడుట కర్హులు. అనఁగా నీపండితుల యభిప్రాయ మిట్టిదని తోచుచున్నది. ఇతరదేశస్థులు మనదేశములో నివ సించి తెలుఁగు మాట్లాడుటయం దలవాటు చేసికొని, యిట్లుగా, తెలుగువారివలె సరియయిన యుచ్చారణయు, వ్యాకరణనియ మములను పాటించినయెడల వారు రంగస్థలములందు నుంచి తెలుఁగు మాట్లాడుట కర్హులు. వ్యాకరణోచ్చారణాదుల

యందు గొందఱయినను సుశిక్షితులు కానియెడల వారు మిశ్రమముగు తెలుగు మాత్రమే మాట్లాడుట కష్టమని తేలుచున్నది. అయితే మన యాంధ్రదేశమందునికి కెన్నడు నవకాశములేని యితరజాతులవారి విషయములో నేమిజేయుదగి యున్నదియు తెలియరాకున్నది. గ్రీసుదేశపు కథలను, రోము దేశపుకథలను, అమెరికా దేశపుకథలను ఇత్యాది యితరదేశపుకథలను మనము నాటకములుగా వ్రాయవలసినచో ఆయా పాత్రముల కెట్టిభాష నియ్యవలెను? ఆజాతులవారు మనదేశములో నెప్పుడయిన నున్నదియు, వారెట్లు తెలుగు మాట్లాడినదియు మన కెంతమాత్రము తెలియదే? ఇంక కొన్నిజాతులవారు మన తెలుగుదేశము నెన్నడును చూచుట యును లేదే? ఇట్టి జాతులవారు మన రంగస్థలములయందే యేభాషమాట్లాడవలెనో యెట్లు మాట్లాడవలెనో తెలియరాకున్నది. కావున నీపండితులు కనుపర్చిన హేతువులను వీరు చేసిన సిద్ధాంతములను మనము సరకుచేసిన యెడల మననాటకములు కేవల మసందర్భములకును హాస్యములకును ఆభాసములకును ఆస్పదములగును.

కాని యీవిషయములో మనకర్తవ్యమేమి? దీని గురించి నాయభిప్రాయము నిక్కడ జెప్పుచున్నాను. ఏజాతి వారయ్యను, ఏభాషవారయ్యున, తెలుగునాటకములలో ప్రదర్శింపబడువారగాన తెలుగుభాషనే మాట్లాడుచూ వారి వారి గౌరవమునకు దగినట్లుగా మాట్లాడుటయే ప్రధానాం

శము. రాజు మాట్లాడెడిభాష సేవకుడు మాట్లాడగూడదు సేవకుడుమాట్లాడెడుభాష రాజు మాట్లాడగూడదు. ఎవరిస్థితికి దగినభాష వారుమాట్లాడుట యుచితము. ఈవిషయమునందు దేశభేదములకును భాషాభేదములకును తావులేదు. మన తెలుగురాజు మాట్లాడినను, తురకరాజు మాట్లాడినను ఇంగ్లీషురాజు మాట్లాడినను, ఈజిప్టురాజు మాట్లాడినను; శైలి యొక్క పేషీకముగ నుండవలెను. శబ్దగౌరవము. భావగాంభీర్యము. ఉత్ప్రేక్షా విన్యాసము, ఇత్యాది, మహాపురుష మానసికలక్షణ ము లేక సుఖ ముగా వర్తింపవలయును. అలాగునే మన దేశపుసేవకుడు మాట్లాడినను జపాను దేశపుసేవకుడు మాట్లాడినను, రష్యాదేశపుసేవకుడు మాట్లాడినను ఒకటేవిధముగ శైలినియమ ముండవలయును. గ్రామ్యపదము లెక్కువగానుండుటయు, ఉచ్చారణయందు దోషములును, మున్నగు నీచపాత్రోచితాభాసములు, నైసర్గికములు, ఈరీతిగనే యితర పాత్రముల గురించియు నిర్ణయించుట సమంజసము, మహాకవుల కృతులనిదానముల నతిక్రమింపలేదు. ఇంగ్లీషు వాఙ్మయమునందలి తాంబుర్లేను, ఔరంగజేబు నాటకములు జర్మను భాషయందలి "ఫౌస్టో" మైడు, ఆఫ్ ఆర్లిన్సు మున్నగు నాటకరాజము లెలాగున వ్రాయబడినవి.

ఇంతవరకు భాషావిషయముల గూర్చియే పరిశోధించితిని. మానసిక వ్యాపారముల, గుణాంశంబు లసంఖ్యాకంబులును, ఏకైకభిన్నాంశములు నగు అదృశ్యములు, అభిప్రాయము

ములు, భావములు, కల్పనలు, రాగరసంబులు, ఉపమాతి శయోక్తివర్ణన శమత్కృతులు మున్నగు మానసిక హృదయిక విశేషంబులు, ప్రతిమనుష్యునియందును వేరువేరుగా నుండును. ఆంగ్లేయదేశపు రాజుయొక్క మానసికోన్మీలనము [mental development] ఆంధ్రదేశపురాజుయొక్క మానసికోన్మీలనమును బోలియుండదు. రుష్యాదేశపురాజుయొక్క మానసికకృషి జపానుదేశపు రాజుయొక్క మానసికకృషికి సరిపోదు. ఈరీతిగ నితరపాత్రములయందును దేశకాలపాత్రములబట్టి మానసిక, హృదయిక, భేదంబు లూహించితంబులగు ఈదృశభేదంబులు సమానపాత్రములయందును గాన్పించును గాన ఆయాభేదంబులు గనుపరచుచు భాషాశైలిమాత్రము, సామాన్యముగా నుచ్ఛనీచప్రమాణంబులను వర్తింపవలయును.

ఆంధ్రవాఙ్మయమునందీకాలమున నవలలయొక్కయు నాటకములయొక్కయు మహాయుగమని చెప్పనొప్పు. ఏలయన నితరవాఙ్మయభాగములకంటె సామాన్యముగ నవలలును నాటకములు నెక్కుడుగ వ్రాయంబడుచున్నవి. మనవాఙ్మయము దేవిభాషాసూచకయినను గీర్వాణవాఙ్మయము మాతృకయయ్యు నాటకనవలావిషయములో మాత్ర మీయాచారము భేదించుచున్నది. సంస్కృత నాటకములు సుమారు రెండువేల సంవత్సరములనుండి మనదేశమందుండియు విశేషతః ఆంధ్రదేశమున బది పన్నెండువందల సంవత్సరము

లనుండి చదువఁబడుచుండియు నాంధ్రభాషలో మాత్రము గత శతాబ్దము వఱకు నిజమైన నాటక మొక్కటియుఁ గానరాకుం డుట యందఱకు నచ్చెరువు గలిగించుచుండిన విషయమే. సంస్కృతనాటకములను పండితులు చదివి సంతోషించిరే గాని వానిని మన భాషలోని కనువాదించుటగాని యనుకరిం చుటగాని జరుపరైరి. దీనిని గుఱించి పలువురు పలువిధము లైన యభిప్రాయములను జెప్పిరి గాని ముఖ్యముగా నాసృ ష్టికి దోఁచిన కారణ మేమన మన వాఙ్మయములో సంస్కృ తమునందుగాని మఱి యేహైందవభాషయందుఁగాని పొడ సూపని ప్రబంధ స్వరూప ముత్పత్తియగుటయే యని చెప్పఁ దగినది. మన ప్రబంధములు సంస్కృత నాటకములకును సంస్కృత కావ్యములకును మధ్యవర్తులు. వీనియందు నాట కముల యొక్కయుఁ గావ్యముల యొక్కయు లక్షణములు సామాన్యముగ నుండుటచే వేఱుగా నాటకముల వ్రాయు నవసరము లేకపోయినది. ఇటీవల నాంగ్లేయ వాఙ్మయము నందలి యనుభవము గలిగిన కొలఁది యాభాషయందున్న నవలలను నాటకములను మనవారు చదివి యామూర్తులను బట్టి ప్రతిమూర్తులను సృష్టింప నుద్దేశించిరి. అందుచేతనే మొట్టమొదటనుండియు దెలుఁగు నాటకముల రచించిన వారాంగ్లభాషాభ్యాసకులయియున్నారు. నాటకరచనోద్దేశ్య మాంగ్లభాషాస్ఫురిత మైనను నాటకరచన మాత్రము కేవల మాంగ్లభాషా జనితము కాదు, ఏలయనఁ దెలుఁగు నాటక

ములు వ్రాసినవారు సంస్కృత నాటకజ్ఞానము గూడ సంపా దించి యున్నవారే. కాబట్టి యాంధ్రనాటకములు కేవల మాంగ్లేయ నాటకముల పోలికను బొందకయు సంస్కృత నాటకముల పద్ధతుల ననుసరింపకయు మధ్యమార్గములం దొక్కి యొక మిశ్రమాకారమును వహించినవి. కథాసం విధానమున సంస్కృత నాటకములను రూపనిర్మాణములో నాంగ్లేయ నాటకములను బోలియున్నవి.

ప్రప్రథమమున నాంధ్రనాటక రచనకుఁ గడంగిన మహానుభావుల దృష్టికొక గొప్ప వాఙ్మయ సమస్య గాన్పిం చినది. ఒకవైపునఁ దెలుఁగు ప్రబంధములు. మఱియొక వైపున సంస్కృతనాటకములు. వేఱొక దిక్కున నాంగ్లేయ నాటకములు. ఈ మూఁటి ప్రకృతులు వారి భావ నైర్మల్య మునుఁ గలఁగుండు పఱచినవి. ఈ మూఁడు విషయములలో దేనినిఁ ద్రోసివేయుటకును వీలులేక తుదకీ మూఁటికిని సమన్వ యము చేయవలసి వచ్చినది. ఆకారణమున మొదటి తెలుఁగు నాటకము లీ మూఁటియొక్క యాభాసములుగాఁ బరిణమించి నవి. శైలియందుఁ దెలుఁగు ప్రబంధములను కథాపోషణయం దును నంగ నిర్మాణము నందును సంస్కృత నాటకములను భావభావనా విస్ఫురణయందు నాంగ్లనాటకములను ననుసరించి యున్నవి. క్రమముగాఁ బ్రబంధశైలిని విడనాడి సామాన్య నాటకశైలిని గ్రహించినను గీర్వాణ నాటకముల యొక్క

యు నాంగ్లనాటకములయొక్కయు పోలిక లిప్పటివఱకు మన నాటకములం బొందింపఁబడియే యున్నవి.

ఆంధ్రనాటక చరిత్ర వ్రాయునపుడు నాంధ్ర నాటకముల యుత్పత్తి విషయములో బళ్లారియును రాజమహేంద్రవరమును నగ్రస్థానములు బొందియున్నవని చెప్పవలసి యుండును. ఈ రెండు స్థలములలోను గొంచె మెచ్చుతక్కువగా సమకాలమందుననే నాటకరచనా ప్రయత్నములు జరిగినవని చరిత్రాన్వేషణమునఁ దెలియుచున్నది. అయినను రచనా పద్ధతులు మాత్ర మీ రెంటియందును వేర్వేఱయ్యెను. బళ్లారియందలి మహానాటక నిర్మాతలగు కృష్ణమాచార్యుల వారును శ్రీనివాసరావుగారును దమ నాటకములం జాల వఱకుఁ బ్రబంధశైలిని వ్రాసియుండిరి. పద్యములనటుంచి సంభాషణలు వర్ణనలు గూడ సంస్కృతపదభూయిష్ఠములైన దీర్ఘసమాసములతో నిండియున్నవి. మధ్యమధ్య ప్రౌఢములైన రగడలు దండకములు నిత్యాదిప్రబంధ సూచకములగు కవిత్వ ధోరణులు యథేచ్ఛముగాఁ బ్రయోగించియున్నారు. కావున నా నాటకములు యథారూపముగా రంగస్థలమందుఁ బ్రయోగించుట కష్టమగుటయేగాక సామాన్యజనులు సూక్ష్మముగా గ్రహించుటయుఁ గూడ నసాధ్యమే. ఈకొఱతఁ దీర్పుటకో యన రాజమహేంద్రవరమునం దుత్పన్నమైన నాటకములు ప్రథమమునుండియు జనసామాన్యమున కతీతము గాకుండెడు సులభశైలిని వ్రాయఁబడియుండెను. ఇట్టి రచనయందు

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు రగ్రగణ్యులని యాంధ్ర లోకమంతయు నెఱింగిన విషయమే. వీరి నాటకములన్నియు ముఖ్యతః వీరి గయోపాఖ్యానము సామాన్యజనులకు సులభ గ్రాహ్యమై యాహ్లాదము గలిగించెడి శయ్యాపాకరీతుల రచింపబడి నట్లాంధ్రలోకమంతటను విదితము. * కందుకూరి వీరేశలింగముగారు సహితము చాలవఱకుఁ దమనాటకములను గడు సులభశైలిని వ్రాసియున్నారు. వారి తర్వాత వచ్చిన నాటకగ్రంథకర్తలందఱు సామాన్యముగాఁ బోంటి ప్రబంధ శైలిని విడనాడి, కేవలము పచింపని గ్రామ్యప్రకృతిని గైకొనకయు, మధ్యమార్గానువర్తులై యాంధ్రనాటకమున కుచితమైన శైలిని నిరూపించిరి. తిరుపతి వేంకటేశ్వరకవులు నాటకములు వారి తక్కిన కవనములవలె జనసామాన్యమునకు వంద్యములు సులభగ్రాహ్యములు.

శైలివిషయములో మన నాటకములందంతే చర్చనీయాంశములు లేకపోయినను గొంతమంది విమర్శకులు తక్కిన వాఙ్మయస్వరూపముల వలెనే కేవల గ్రామ్యభాషా ప్రయుక్తములయియుండవలెననియు మఱికొందఱు కేవలము గద్యాత్మకములుగ నుండవలెననియు చిత్రవిచిత్రాభిప్రాయములు వెల్లడించుటయుఁ గలదు. కాని ప్రపంచమందలి ప్రతిదేశమందును ప్రాచీనకాలము నుండియు నిప్పటివఱకుఁ బ్రసిద్ధిఁ

---

* కొన్నిభాగములు మాత్రము కేవలము ప్రాకృతజనుల కాహ్లాదము పుట్టించెడు రీతిని వ్రాయఁబడినట్లు గాన్పించును.

జెందిన నాటకరూపముల యనుభవము లే యభిప్రాయము లను వేనోళ్ల ఖండించుచున్నవి. అట్టి విపరీతాభిప్రాయము లనుం బ్రపంచానుభవమే సరియగు ప్రత్యుత్తరమనితలంచెద.

సంస్కృత నాటకముల నిర్మాణము మున్నగు విషయ ముల నిర్ణయించెడు లాక్షణిక గ్రంథములు చాలవరకా భాష యందున్నవి. కాని యాంగ్లేయ నాటకముల నిర్ణయించెడు లక్షణగ్రంథము లాభాషయందుం గొలందిగమాత్రము గాన్పిం చుచున్నవి. ఆకారణమున నాంగ్లేయనాటకము లిప్పటికిని నిరర్గళపద్ధతుల విజృంభించుచున్నవి. అంకనియమము తప్ప నితరనియమములు సామాన్యముగం గానరావు. గ్రంథకర్త యొక్క మనోభావములు నైసర్గికముగ వికసించి యనేకరూ పములం బెంపొందుట కేవిధముగు నాటకము లుండును. మానవజాతియొక్క నానారూపసౌందర్యము వానియందు సురుచిరముగం గానంబడును.

మన తెలుంగు నాటకముల కిప్పటివఱకు లక్షణగ్రంథ ములలేమి యొక మహాభాగ్యమని నాతలంపు. ఈభాగ్యము చిరకాలముండుంగాక. సంస్కృత నాటకవిధానమును దెలుం గులయందుం జొప్పించుటకు విద్వాంసులు చేసెడు ప్రయత్న ములు వానికంతగా మేలొనర్చునవి గావని నాయభిప్రాయ ము. తెలుంగునాటకములను దేశకాలపరిస్థితులకనుగుణ్యముగా వృద్ధినొంద నిచ్చుటయే ముఖ్యకర్తవ్యమని నాయాశయము. శుద్ధవిష్కంభములు మిశ్రవిష్కంభములు నిత్యాదిసంస్కృత

నాటక నియమములతో మనకుఁ బనిలేదు. విస్తృతికి నవకాశము పెరిగినకొలఁది విస్తృతి విజృంభణములుగూడఁ బెరుగుచుండును గాన సూక్ష్మనిబంధనలకంటె స్వాతంత్ర్యమే యెక్కుడు మేలొనర్చును.

ఇఁక నాటకకథల విషయమై యొకించుక చెప్పి యీవిభాగము ముగించెద. మన నాటకకథలు సర్వసామాన్యముగ భారతరామాయణములు నష్టాదశపురాణములు నుపపురాణములు స్థలపురాణములు మున్నగు గ్రంథములనుండి తీయఁబడుచున్నవి. అందువలనఁ గొన్ని లాభములును గొన్ని నష్టములునుగూడ గలుగుచున్నవి. మన హైందవజాతీయత నిల్చుటయు దైవభక్తి కుదురుటయు నతిలోకాదర్శములు నెలకొల్పుటయు మొదలగు లాభము లున్నను జనసామాన్యమునకు నిజమగు దేశచారిత్రకజ్ఞానముగాని ప్రపంచజ్ఞానముగాని కలుగుట కవకాశము లేకున్నది. ఎల్లప్పుడును సీతారాములు సావిత్రి శకుంతల హరిశ్చంద్రుఁడు మున్నగువారి కథలే యనేకవిధములఁ బరివర్తింపఁబడి నాటకరూపములుగా వ్రాయఁబడుచున్నవి. వీనివలన స్త్రీపాతివ్రత్యము, జీవితమందలి యాత్మత్యాగోత్కృష్టత మున్నగు హిందూధర్మనియోగములు నిరంతరము మనకన్నులయెదుటఁ గట్టఁబడుటచేత మన జీవచారిత్రములు నెల్లప్పుడును నాకాశగమన సంచారుల వలెను లాప్యూటా (Laputa) దేశస్థులవలెను ప్రపంచాతీత

భావములను మాత్రము పరిగణించుచున్నాము. మన మీ మానవ ప్రపంచమందు నివసించుటచేతను మానవకోటిలో మెలఁగుచుండుటచేతను మనవలన దేశమునకుఁ బురోవృద్ధి గలుగవలసి యుండుటచేతను మనకు మానవకోటికి సంబంధించినయుదంతములే యెక్కుడుగ రచింపవలెను. పోప్ (Pope) మహాకవీశ్వరుఁడు "The proper study for mankind is man" అని చెప్పియున్నాఁడు. మనుష్యశాస్త్రములను మనుష్య భాషాభాషణములు మనుష్యవికాసములును నానాదేశములలో నానాకాలములయందేయుఁ గలిగిన మార్పులను నిరూపించుటచేత జనసామాన్యమునకుఁ గలిగెడు మనోవికాసము జాతీయవృద్ధికిని దేశాభివృద్ధికిని దోడ్పడక మానదు.

అతిలోకమగు స్త్రీపురుషులను వర్ణించుటలో రెండు కష్టములున్నవి. దైవసమానులను మనుష్యసమానులుగా నిరూపించుట (Anthropomorphism) యొక కష్టము మానవప్రవృత్తులలోఁ బైపయిల్లెనియున్న మనకు నతిలోక స్త్రీపురుషుల భావవికారములను సరిగా భావించుకోలేము రెండవ కష్టము. ఈ రెండుకష్టములవలనను గవీశ్వరులు తమగ్రంథములయందనేక లోపములు చేయుచున్నారు.

నాటకములు కొంతవఱకు మహాప్రబంధముల సహాయముఁ జెందియున్నవని యిదివఱకే చెప్పియుంటిమి. దేవతలు రాక్షసులు గంధర్వులు నిత్యాద్యతిమానుష స్త్రీపురుషులనుగుఱించి వర్ణించుటచేత నయ్యామహాప్రబంధములు మనకు నరూపావ్యా

ము గాఁ జేయఁబడు చున్నది. ఆ కారణము చే నాటక ప్రేక్షకులు భూమికిం జెందక యాకాశమునకుం జెందక మధ్య నంతరాళ మున ద్రిశంకునివలె నూఁగులాడుచుందురు. కవులన్ననో విశృంఖలులై స్వేచ్ఛావిహారులయి యీ యతిమానుషపాత్రముల యథేష్టముగా వర్ణింతురు. కొంద ఱుత్కృష్టముగాను కొంద ఱతినికృష్టముగాను వర్ణించుచుందురు. కావున నియమాన్వితులగు వాఙ్మయ రసికవతంసు లేవగించుకొని నిరుత్సాహులగుచున్నారు. ఇట్టి దురవస్థ యీ మానవప్రకృతియుత మగు ప్రత్యక్షప్రపంచమును బోనాడుటవలననే కలుగుచున్నది.

మానవప్రకృతిని వర్ణించుట యెక్కుడుకష్టమని యెల్లరకుం దెలిసిన విషయమే. ఏలయన మానవలక్షణములు వివిధజాతులలో వివిధదేశములలో వేర్వేఱు రూపములఁ దాల్చియుండుటచే నాయాలక్షణముల గ్రహించినఁగాని నిజముగా గ్రంథకర్త వానిని గుఱించి వ్రాయలేఁడు. ఇట్టి గ్రహణశక్తి యనుభవశాలురకే గాని యలవడదు. కావున నల్పవయస్కులు మొదలగువారు నాటకరచనకుఁ గడంగిన చో నడుగడుగునకుఁ దడఁబడుచుందురు. అట్టి యనుభవహీనులు వ్రాసిన గ్రంథములు రసహీనములై తేలికగానుండి ప్రజలకు రోఁత పుట్టించును. ఆహేతువున సాహిత్యాంతమగు నాటకము పసిబాలుర చేతులలోఁ బడి చెడిపోవుటయుఁ దటస్థించును. కావున నీముప్పుఁ దప్పించి నాటకముల నెప్పుడు నున్నతపద

గిని నిల్పుటకు మహానుభావులై మానవ చరిత్రలను రూపకములుగ వ్రాయుట యుత్తమము. ప్రేక్షకులన్ననో యీ మానవ ప్రపంచములోఁ బుట్టిపెరిగి గిట్టిన తమ తోడివారలు పాత్రములచే నలరారు నాటకములఁ జూచి తమవలెను భావ వికారము లాయా పాత్రములయందుండుటచే తమ్ముఁ దామే యంతర్ముఖులై చూచుకొందురు. ఆహేతువువలనఁ దమమానసములను గొంతవఱకు బరిశోధించుకొని దిద్దుకొనఁగలరు. నాటకములయొక్క ముఖ్యోద్దేశ మీయుపాయమూలమునఁ దప్పక నెరవేఱును.

కావున నాయాశయ మేమనఁ:—మనము నివసించి యున్న యీచరాచరయుక్తమగు ప్రపంచమును నిజముగ వర్ణించి మన దేశీయుల కన్నులకుఁ గట్టినట్టుల ప్రకృతిని బ్రదర్శించుట ముఖ్యావసరము. అట్లు చేయుటలోఁ గూడ జనసామాన్యముయొక్క యూహాశక్తుల పరిమితినిగూడఁ జూడవలయు. వారి యూహకు మించిన ప్రయోగములు నిరుపయోగములు. కాబట్టి మన యాంధ్రదేశచరిత్రను బరిశోధించి కాని మన ప్రాక్ఖండచరిత్రలను బరిశోధించికాని మన భారతదేశ చరిత్రను బరిశోధించికొని వ్రాసిన నాటకములు మన దేశీయులకు సాహ్యములై గ్రాహ్యములై రుచిఁ బుట్టించి వారియొక్క బుద్ధి వృద్ధులకుఁ దోడ్పడి వారియందు నాగరికతయును మానసోన్నతమును బెంపొందింపఁ జేయఁగలవు. ఈపద్ధతు లిటీవలఁ గొంతవఱ కాచరణలోనికి వచ్చుచున్నవని

సంతసించుచున్నాము. కోలాచలము శ్రీనివాసరావుగారు వ్రాసిన "రామరాజు" వారణాసి శ్రీనివాసరావుగారు వ్రాసిన "రక్తబలి" కొప్పరపు సుబ్బారావుగారు వ్రాసిన "రోషనారా" మున్నగు నాటకము లీనూతన మార్గములఁ ద్రొక్కుచున్నవి. ఇట్టిగ్రంథము లింకను వేనవేలీ యాంధ్రప్రపంచమున వెలసి మన ప్రజలకు దేశభక్తిని చరిత్రజ్ఞానమును గలిగించుఁగాత!

N. B. ఈ రెండవ అధ్యాయమునకు శీర్షికశ్లోకముగా యీ క్రిందిశ్లోకమును గ్రహింపవలయును.

శ్లో॥ "ఔచిత్యం వచసాం ప్రకృత్యనుగతం సర్వత్రపాత్రోచితీ
పుంభిః స్వావసరే రసస్య చ కథామార్గే చ జాతిక్రమః
శుద్ధిః ప్రస్తుతసంవిధానకవిధౌ ప్రౌఢిశ్చ శబ్దార్థయో
ర్విద్వద్భిః పరిభావ్యతా మవహితై రేతావదేవాస్తు నః"

[భోజుఁడు.]

3 పాత్రపోషణము.

శ్లో॥ నానాశీలాః ప్రకృతయః శీలే నాట్యం ప్రతిష్ఠితమ్।
తస్మాల్లోకప్రమాణం హి నాట్యం జ్ఞేయం ప్రయోక్తృభిః॥
[భరతమునినాట్యశాస్త్రము.]

నాటకములయందు వచ్చెడిపాత్రములు సామాన్యముగ మూఁడురకములక్రింద నేర్పఱుపవచ్చును.

1 ప్రకృతిసిద్ధములు, 2 పురాణసిద్ధములు, 3 కల్పితములు.

1 ప్రకృతిసిద్ధములు:-

మానవకోటియందు జాతిభేదములఁబట్టియు, దేశకాలభేదములఁబట్టియు, వృత్తిభేదములఁబట్టియు, మనుష్యసంఘములప్రకృతులు కొంతవఱకు, వేఱువేఱుగనుండును. అయిన నొకానొకదేశమందున్న వారియందుఁ గొన్ని సామాన్యగుణములును, యొకానొకజాతివారియందు గొన్నిసామాన్యలక్షణములును కాన్పించుచుండును. అట్లే యొకానొకవృత్తి నవలంబించినవారియందుఁ గొంత గుణసాదృశ్యము గలుగుచుండును. ఈసాదృశ్యభేదములను సూక్ష్మదృష్టితో నారసి సమన్వయించి విశేషముగ ప్రకృత్యనుభవజ్ఞానము సంపాదించినవాఁడే నాటకముల వ్రాయుటకుఁ గడంగవలయును, ఇట్టియను

భవజ్ఞానము లేని బాలుఁడుకాని పరిశీలనప్రవృత్తి లేని వృద్ధుఁడు కాని రచించిన గ్రంథములయందుఁ బాత్రౌచిత్యమంతయుండుట కవకాశము తక్కువ. ప్రకృతినిర్దిష్టములగు పాత్రములయందుఁ బ్రకృతిలక్షణములు గాన్పించనియెడలఁ బ్రకృతి నన్వేషించి సాధించుటవలనఁ గలిగెడి యాహ్లాదము మనమనంబులయందుఁ గలుగుట దుర్లభము. అట్టియాహ్లాదము గలుగని యా నాటకములు నీరసములనియు, అస్వాభావికము లనియు నిరసించుదుము. ఈవిషయమును షేక్స్పియరు మహాకవియిట్లు చెప్పియున్నాఁడు. "The purpose of a play is to hold, as it were, the mirror up to Nature; to show virtue her own feature, scorn her own image and the very age and body of the time his form and pressure."

కావున ప్రకృతిప్రపంచమునుండి తీసి కనుపఱచిన పాత్రములు ప్రకృతిసిద్ధములుగ నుండవలెను. బహిరాకారములును, మనోభావములును, సమానముగనే ప్రకృతియందుఁ బ్రతిబింబితములుగ నుండనోపు, సులక్షణాకృతుల నాదర్శనిష్పత్తి కనుకూలముగఁ జేర్చి చిత్రించిన యా నాటకగౌరవము చెడదును. అవలక్షణవికారములను మాత్రమే స్వీకరించి హాస్యజనకములుగ నుండునట్లు ప్రదర్శించినట్లయిన నానాటకములు తేలికలైన ప్రహసనములుగా నుండును. కాని యుభయవిషయములయందును ప్రకృతియొక్క ప్రతిఫలనము సమానముగనే యుండును. అయినను యుద్దేశభేదముచే గుణప్రదర్శనభేదము గలుగుచున్నది.

నాటకములయందలి పాత్రములగుణపోషణఁ జేయు టకు గుణవర్ణనఁ జేసినమాత్రమునఁ జాలదు. అనఁగా నొకానొక పాత్ర మిట్టిట్టి గుణములు గలదని యాయాగుణముల పట్టిక వ్రాసినసరిపోదు. ఆయాగుణముల విశదీకరించు నవస్థలఁ గల్పించి యితరపాత్రముల సంభాషణలచే నభివర్ణనఁ జేయించి ప్రదర్శించుట యుక్తమగుపద్ధతి. ఈయవస్థలను కల్పించుటయం దుచితానుచితములను సందర్భాసందర్భము లను గుర్తెఱుఁగవలెను. శ్రీరాముఁడు దొంగవాఁడు కాఁడని తెలియఁజేయుట కాతనిని దొంగలగుంపులోఁ జేర్చి వారు చేయు క్రూరకృత్యముల నాయనచే దూషింపఁజేయుట పరి హాసాస్పదమగు పద్ధతిగాని, ప్రశంసనీయమగునది కాదు. ఏల యన, శ్రీరాముఁడు ధూర్తుఁడు కాఁడని నిర్వచనము చేయుటకు నవసరంబెట్టి... ముం ప్రతిదోషగుణము లేదని ప్రత్యేక దృష్టాంత పూర్వకముగఁ జూపినఁగాని, ఆయనమాహాత్మ్యము నకు గొఱంత గలుగునా? ప్రతిమహానుభావునియందును సుగుణములన్నియు నున్నవనియు, దుర్గుణము లెవ్వియు లేవ నియు, ప్రత్యేకముగా నిదర్శనములఁ గల్పించి చూపనుద్దేశిం చిన గ్రంథము నాటకమనఁదగినది కాదు. నిరుపయోగమగు పత్రసముదాయమని చెప్పనొప్పును. ఒకానొక నాటక గ్రంథ కర్త శ్రీకృష్ణునిఁగూర్చి వ్రాయుచు నామహానుభావుఁడు దక్షి ణనాయకుఁ డయినను ఆయనదాక్షిణ్యములో నుచితానుచిత పక్షపాతశూన్యుఁడై నున్నవని తెలియఁజేయుటకొక ప్రస్తావమున

జీవితంతువును గల్పనఁ జేసి యామె యా యాదవసింహునిఁ జూచి మోహపారవశ్యమున నమనోభవకేళియందుఁ దనుపుమని కోరగా నాపురుషవరేణ్యుఁ డామె నూరార్చి పాతివ్రత్యఫలము నుపదేశించెనట! ఈకల్పన శ్రీకృష్ణుని సత్ప్రవర్తన కెంత మెఱుంగు పెట్టినదో నాకుఁ దెలియదుగాని కవియొక్క కల్పనాచాతుర్యమున కెంతగ నొక్కి లోపమున్నదో తేటపడుచున్నది. కావున పాత్రముల గుణాగుణముల విశదీకరించుటకుఁ గల్పించెడి యవస్థలు (Situations.) ఆయాపాత్రముల గౌరవమునకుఁ దగినవిగా నుండవలెను. ఊహకుఁ దోఁచినవెల్లయు వ్రాయుట సమంజసముగా నేరదు.

2 పురాణసిద్ధములు:-

పౌరాణిక కథలు ప్రాచీనకాలమునుండియు బహు తరచుగ నాటకములరీతిని వ్రాయఁబడుచున్నవి. తొల్లి వ్రాల్త సంస్కృతభాషను గాళిదాసాది మహాకవులచే నాటకరూపములుగ వ్రాయఁబడిన కథలను మనవారు తెలుఁగునాటకములుగ వ్రాయుచుండుట యెల్లరకును దెలిసినవిషయమే. కాని యొకానొక పౌరాణికపురుషునిఁ గూర్చి పెక్కండ్రు వ్రాసిన గ్రంథములలోఁ బెక్కురీతులఁ గాన్పించుచున్నవి. ఒకేపురుషుఁడు వివిధగ్రంథములలో వివిధరూపములఁ దాల్చుటయుద్భటము అసమంజసముకావున పౌరాణికకథలయందు వచ్చెడు పురుషులయొక్కయు స్త్రీలయొక్కయు పాత్రపోషణమెట్లుగా నుండఁదగునో విచారింతము. ఈవిషయమును చర్చించుటకు

ముందు మన మొక సంగతి వ్యక్తపరుపవలసియుండును. పౌరాణికకథలన నెవ్వి? ఇతిహాసములును అష్టాదశపురాణములును దేశచరిత్రములును స్థలపురాణములును ప్రాచీనదాసరిపదములును మున్నగు నవన్నియుఁ బురాణకథలనియే వ్యవహరింపవచ్చును. ఈకథలయందలి స్త్రీపురుషుల గుణపోషణము నాటకముల యందెట్లు నిరూపింపవలయును? ప్రాయశః ఆయా స్త్రీపురుషుల కాయాకథలయందే గుణవర్ణనలు జేయఁబడిన పైనాటకములయందును అట్టి గుణవర్ణనలే చేయఁదగినవి. అట్టి గుణవర్ణనము లేని విషయములోఁ గవీశ్వరుఁడు విశృంఖలుఁడయి యిచ్ఛానువర్తిగా నుండవచ్చును. ఏకపత్నీవ్రతుఁడగు శ్రీరాముఁడు, దక్షిణనాయకుఁడగు శ్రీకృష్ణుఁడు, నిత్యసత్యవ్రతుఁడగు హరిశ్చంద్రుఁడు, సర్వసంగపరిత్యాగియగు బుద్ధుఁడు, ప్రేమసాగరుఁడగు అశోకుఁడు, సుగుణఖనియగు సీత, పతివ్రతయగు సావిత్రి, అద్భుత దేశాభిమానియగు అహల్యాబాయి, అద్వితీయ రాజ్యతంత్రవేత్తయగు నూర్జహాను, అతిలోకపరాక్రముఁడగు బాలచంద్రుఁడు, పతివ్రతాశిరోమణియగు కామమ్మ, యిట్టివారిగుణగణములు ప్రాచీనగ్రంథములయందు నిర్వచింపఁబడి సిద్ధములై యున్నవి. వానిని మార్చుట కెవ్వరికిని శక్యముగాదు. సీజరు, బ్రూటస్, ఆంథొని, మొదలగు చారిత్రక పాత్రముల గుణపోషణ ఆ దేశచరిత్రలయందుఁ జెప్పఁబడిన రీతిని యున్నట్లే మనపురాణములయందును, చరిత్రలయందును స్థిరరూపమునయున్న నాయికానాయకుల

గుణావగుణములు యథాస్థితిగ వర్ణింపఁదగినవిగాని, మార్చుటకు వీలుండదు, మార్చినచోఁ దగినహేతువులుండవలయును. క్రూరుఁడగురాజు క్రూరుఁడుగనే వర్ణింపఁదగును. మనము కరుణించి వానిని దయార్ద్రహృదయునిగఁ గనపరచుట సత్యమునకు విరుద్ధము. అట్టిగ్రంథము స్వభావప్రకృతిని విడనాడి నింద్యమగుచున్నది. అయిన నొకానొకపురుషుని గూర్చి వేఱ్వేఱ అభిప్రాయములు చరిత్రలలోఁగాని, యితరప్రాచీనగ్రంథములలోఁ గాని చెప్పియుండినయెడల మనకిష్టమైనదానినిగ్రహించి యాపాత్రను నిరూపింపవచ్చును. అంతకంటె హెచ్చు స్వాతంత్ర్యము గ్రంథకర్తకు లేదు.

3 కల్పితములు.

కల్పితపాత్రములఁగూర్చి కవి "స్వైరవిహారి". తన గ్రంథమందనస్థలనుగాని, పాత్రములఁగాని, గుణములఁగాని, కల్పించుటకుఁ దనయిష్టమువచ్చినట్లు నడపింపవచ్చును. అయిననేపాత్రను మొదట నొకవిధముగాను ఆగ్రంథమందే తరువాత వేఱొకవిధముగాను మార్చివేయుట యక్రమము, అస్వాభావికము. అట్టిమార్పు నిరూపించుటకుఁ బ్రబలకారణములు గ్రంథమందుండవలయును. లేనిచోఁ బాత్రపోషణ క్రమానుగత సమన్వయము (Consistency.) పొందనేరదు. సమన్వయములేని పాత్రము స్వభావవిరుద్ధమయి రుచింపనేరదు. కలభాషిణి చంచలహృదయ, ఆమరణాంత మట్లే నిరూపింపఁబడినది. ఆనాయిక తనసుకృతముల ఫలముగ రెండవజన్మమందుఁ

బతివ్రతగా మారినది. వసంతసేన మొదటినుండియు పతివ్రతయే. సుప్రసిద్ధకవిపుంగవుండగు షేక్స్పియరు కల్పించిన ఫాల్‌స్టాఫు (Falstaff.) అనుపాత్రము ఆయనరచించిన రెండుమూడు నాటకములందుఁ గానుపించును. ఎచ్చటనయిన నాకేవిధముగ నింద్రియవ్యాపారలోలుఁడు గాను నిత్యసుఖైకపరాయణుఁడుగాను కనఁబడునుగాని, యొక నాటకమునం దొకరీతిని మరియొకనాటకమునందు మరియొకరీతిని జిత్రింపఁబడలేదు. ఈవిధమగుసమన్వయము మహాగ్రంథకర్తలందఱు తమకల్పితపాత్రములయందుఁ బాటించియేయున్నారు. ప్రథమమున రాగోద్రేకుఁడుగానున్న మనుజుఁడంతమందువిరాగిగాఁ బరిణమించుట తటస్థించును. ఆమానసికపరిపాకమునుఁ బ్రబలకారణములచే నిర్వహింపని దోఁ బాత్రపోషణయందు వెలితి గలుగును. కావున కల్పితపాత్రముల విషయములలో గ్రంథకర్త తనపాశములచేఁ దానే కట్టఁబడియుండును.

4 సుఖాంత నాటకములు, దుఃఖాంత నాటకములు.
(Comedies and tragedies)

---:o:---

శ్లో॥ఏకో రసః కరుణ ఏవనిమిత్తభేదా
ద్భిన్నః పృథక్పృథగివ శ్రయతే వివర్తాన్।
ఆవర్తబుద్బుదతరంగ మయాన్వికారా
నమ్భోయథాసలిలమేవ హితత్సమస్తమ్॥

(భవభూతి.)

ఆంధ్రనాటకము లెప్పుడును సుఖముగా నంతమొందవలయునుగాని దుఃఖములో ముగియఁగూడదను కఠిననిర్ణయ మొకటిగలదు.

శ్లో॥పంచసంధి చతుర్వృత్తి చతుష్షష్ట్యంగసంయుతం।
షట్త్రింశల్లక్షణోపేత మలంకారోపశోభితం।
మహారసం మహాభోగ ముదాత్తరచనాన్వితం।
మహాపురుషసత్కారం సాధ్వాచారం జనప్రియం।
సుశ్లిష్టసంధియోగం చ సుప్రయోగం సుఖాశ్రయం
మృదుశబ్దాభిధానం చ కవిః కుర్యాత్తు నాటకం॥

సాహిత్యదర్పణం [6, ప]

కావున నేనాటకముచూచినను నాయికా నాయకులును తక్కిన ముఖ్యపాత్రలును నాటకాంతమున సుఖముగా నానందముతో నివసింతురు. ఈనిబంధనము ప్రకృ

తికి విరుద్ధమేకాక మానవప్రపంచమునందలి యనుభవచరిత్రలో నొకసగము భాగము మానవనిత్యజీవనమున కుపయోగింపకుండ చేయుటయు గలుగుచున్నది. జాతియందుగాని వ్యక్తియందుగాని కష్టపరంపరలు గలుగుచుండుట సర్వసామాన్యముగదా! ఈకష్టపరంపరలెల్లప్పుడు నెల్లెడలను సుఖాంతముగనుండునా? విపత్తులు కొన్నివిషయములలో విషాదమగు మరణమును గలుగఁజేయుటలేదా? దుష్ప్రవర్తనకు లోఁబడు మనుజుఁడు పరిణామమున సుఖమునొందుచున్నాఁడా? తన దుర్వ్యసనములచేఁగాని దుష్కర్మలచేగాని ప్రాణమునుగోలుపోవుటలేదా? దురహంకారపిశాచముచే నావిష్టుఁడైన రామరాజు రణరంగమునఁ బ్రాణములువిడువలేదా? శాత్రవులదురాశలకు బలియై రంగరాయుఁడు వీరస్వర్గముఁ గైకొనలేదా? ఈలాగున నేదేశమందైనను ఏకాలమందైనను గొప్పవారిలోఁగాని కొద్దివారిలోఁగాని దైవికముగనో స్వాభావికముగనో ముప్పువాటిల్లుట యనుభవవేద్యమే. అయితే నాటకము జీవితప్రపంచమునకుఁ బ్రతిబింబమని చెప్పి యెల్లపుడును వ్యక్తిజీవితము సుఖాంతమగునట్లు నిరూపించుట యథార్థమునకువిరుద్ధమగుచున్నదని వేఱజెప్ప వలయునా?

ఈసంగతి యంతయుఁ దెలిసియుండియు మనవారాసన్నమైన మృత్యువు నెదుర్కొనఁజాలక కనికరముఁబూని యేదోవిధముగ మృత్యుదర్శనముఁ దప్పించుకొనఁ బ్రయత్నించిరి. ఆప్రయత్నము లప్పుడప్పుడు చిత్రవిచిత్రగతులొంది

ప్రేక్షకులకద్భుతము గలుగఁజేయుచుండును. గ్రంథకర్త స్వాభావికపద్ధతుల మరణముదప్పింపలేనియెడల నొకటో రెండో పద్యములువ్రాసి భగవంతునిఁ దెప్పించును. ఆభగవంతుఁడా పద్యములన్ను వినగానే సంచులోనుండియో గోందిలోనుండియో పరుగునవచ్చును. మృతకళేబరము దిగ్గునలేచును. అందఱుచూచి కెవ్వున కేకలువేసి సంతసించెదరు. మృత్యువును దప్పించుటగాని మరణించినవానిఁ బ్రతికించుటగాని యింత సులభసాధ్యమయినచో లోకములోఁ జచ్చినవారే యుండరు. అందరు చిరంజీవులే. కావున ప్రతినాటకము సుఖాంతముగా నుండవలయుననునిర్ణయము కేవల మస్వాభావికము అనుభవ వ్యతిరేకము.

ఆంగ్లేయమహాకవియగు "మిల్టను" ఒకానొకసమయమున దుఃఖాంతమగు నాటకమునుగురించి యిట్లనుడివెను. "Tragedy, as it was anciently composed, hath been ever held the gravest, moralest and most profitable of all other Poems; therefore said by Aristotle to be of power by raising pity and fear or terror to purge the minds of those and such like passions, that is, to temper and reduce them to just measure with a kind of delight stirred up by reading or seeing those passions well imitated." దుఃఖాంతనాటకమునీత్యుద్బోధకమగుగ్రంథసముదాయములలో మిన్నయుకవనసంచయములోనత్యుపయోగకరమైనదియుగావుననే ప్రాచీననియంతయగు అరిస్టాటిలుకీ

నినిగురించి చాల నుగ్గడించెను. కరుణభయానక భీభత్సాది రసములు ప్రేక్షకుల యుల్లంబుల నుద్భవించి యట్టి రసోద్రేక పరిచయమువలన వారికి జీవితావస్థలలో నటువంటి యాందోళన బాధ ముందెన్నడును కలుగకుండఁ జేయఁగలుగునని యీసుఃఖాంతనాటకములే. మఱియు నుత్కృటరసావస్థలు రంగస్థలమునందు నైజప్రకృతి ననుకరింపఁబడగా వారుచూచి యొకవిధమయిన సంతోషముతో తమస్వజీవితమునందట్టి యవస్థలు కలిగినప్పుడు ద్వేలమైన రసాతిశయముఁ బొందక సమస్థితిని యుంచుటయు తటస్థించును. దుఃఖసాధనములతో జీవితాశయముఁ బరిశుభ్రపరచెడు సంవిధానము యితరదేశములకన్న మనదేశమందెక్కువగా వాడుకచేయఁబడుచున్నది. సామాన్యముగనేకథ జూచినను గష్టపరంపరలే. ఇన్నికష్టములననుభవించియు తుదకు దైవసహాయముచేత సుఖావాప్తి కలిగినట్లు మనమంతముజేయుదుము. ఇతరదేశములలో గష్ట జీవికి కష్టములే పరిణామముగా నున్నట్లు కనుపరచెదరు. హరిశ్చంద్రుఁ డనృతము లాడక యెన్నియో కష్టములనుభవించి తుద కీశ్వరసహాయ్యమున సుఖమునొందెను సావిత్రి శకుంతల కథలు వేరేచెప్పనక్కరలేదు. నలుఁడు ద్యూతకారణమున రాజ్యమును భార్యనుగోలుపోయి దైవబలముచే మగుడిసంపాదింపగలిగెను ఈప్రకార మన్నివిషయములందును దైవబలమును కూడిపెట్టి కష్టములఁ దొలగింపచేయుట మనవారికి వాడుకయినది, గాని యీవాడుక యిటీవలివారి మతమై

యుండవనోవు, ఏలయన భారతవర్షములో ప్రథమకవియయి కవిశ్రేష్ఠుయని పేరొందిన వాల్మీకిమహాకవికి మాత్ర మిట్టిదిచ్ఛియభిప్రాయముండినట్లు గాన్పింపదు. ఆయన రచించిన రామాయణము నిజముగా దుఃఖాంతమే, సుఖాంతగ్రంథములలో నగ్రస్థానమిన్వఁదగినది.

లోకాపవాదమునకు నెతిమాత్రమునగా వశ్యుడై స్వీయ స శ్రీరామచంద్రుడు తన ధర్మపత్నియైన సీతను గోల్పోయి దుఃఖాంబుధిలో మునిఁగి పరమపదించినట్లు నిశ్శంకముగా వెల్లడించెను. దైవమూర్తియగు శ్రీరామచంద్రుడు దైవబలముచేత సీతను దెచ్చికొని సుఖింపలేకపోయెనా ? అట్లు చేయక యమ్మహాకవిసార్వభౌముడు కథావసానము దుఃఖవిమగ్నము జేసివైచెను. ఆకథనే తరువాతికవియగు భవభూతి నాటకనియమములకొఱకు సుఖాంతముగఁ జేయ ప్రయత్నించి యెట్లు తిప్పలు పడెనో చూడుడు.

వాల్మీకిమహామునిసీతాదేవివనవాసకథను నాటకరూపముగా రచించెనఁట. ఆనాటకము నప్సరసలు ప్రదర్శించిరి. దానిని చూచుటకు మూడులోకములవారు వచ్చిరి. రామలక్ష్మణులు జనకాదిబంధువులు నటఁ జేరిరి. అట్టి విశాలసభలో నానాటకము ప్రదర్శింపఁబడెను. ఇందు సీతాదేవియొక్క పాతివ్రత్యము నిస్పష్టముగా నిరూపింపఁబడెనఁట. దేవతలుహర్షించిరి. మునులానందించిరి. వీరందఱు నిచ్చిన యోగ్యతాపత్రి

కఁ జూచుకొని యనుమానపు భర్తలలో నగ్రగణ్యుఁడగు శ్రీరామచంద్రుఁడు సీతను పునఃపరిగ్రహించెను. ఈ ద్రావిడ ప్రాణాయామ మంత్రమును జూడుఁడు. సుఖాంతముగాఁ గ నుపరచుటకుఁ గవి పడిన పాట్లు జూడుఁడు. ఇంతటి యవస్థఁ బొందనేల? అసలుకెధ నున్నదియున్నట్టుల వ్రాసిన నేమి విపత్తు కలుగును?

బహుకష్టజీవియై భర్తయొక్క పరీక్షలతో విసివివేసారిన పుణ్యసాధ్వీలలామ యగు సీతాదేవి తనకడపటి పరీక్షకాలమునఁ దల్లియగు భూదేవినుద్దేశించి పలికిన దీనాలాపములను వినుఁడు.

శ్లో॥ "సర్వాన్ సమాగతాన్ దృష్ట్వా సీతాకాషాయవాసినీ
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్య మధోదృష్టి రవాఙ్ముఖీ।
యథాహం రాఘవాదన్యం మనసాపినచింతయే
తథామే మాధవీదేవీ వివరం దాతుమర్హతి।
మనసా కర్మణా వాచాయథారామం సమర్చయే
తథామే మాధవీదేవీవివరం దాతుమర్హతి।
యథైతత్ సత్యముక్తం మే వేద్మిరామాత్పరంనచ
తథామే మాధవీదేవీవివరం దాతుమర్హతి॥"

ఈమర్మరశోకగర్భితములగు శాంతవచసములు మానవహృదయములను పరీక్షించునవి యా లేక భవభూతి వ్రాసిన సీతావనవాసనాటకమా? చదివినపుడే నిర్ణయింతురు గాక!

నాటకము కేవలము దుఃఖాంతముఁ జేసి ప్రేక్షకుల యుల్లంబుల విషాదముమాత్రము నెలకొల్పి వారిని గృహములకంపుట యేటిపురుషార్థమని కొందరు శంకింపవచ్చును. తెరువులేని శోకసముద్రమున ముంచి నిస్సహాయముగా నుంచుటకంటె దుఃఖాంబుధికంతకు నౌకయనందగు కరుణామయుండగు భగవంతుని నిరంతరసాన్నిధ్యమును నిర్నిమిత్త సాహాయ్యమును ప్రదర్శించుటయే యోగ్యతమముగా బాయని యాక్షేపింపవచ్చును. విపదవస్థలలోనున్న మానవుని రక్షించుటయే పరమావధియనియు నట్టి రక్షణ భగవంతుఁడు తప్ప వేరొకరు సంపూర్ణముగాఁ జేయలేరనియుఁ దెలుపవలసినదో నాసంవిధాన మితరగ్రంథము లన్నింటికిని యేల వర్తింపఁగూడదు? ఒక్క నాటకములకే మనవారు నిర్ణయింపవలసినదేల ? అనేకమైన పాటలు, పదములు కథలు వ్రాయఁబడినను అందీ నియమము పాటింపకయే వ్రాసియుండిరే. అట్టి భేదము నాటకములమాత్ర మేలకలుగవలెను? కావున వాఙ్మయము ప్రకృతికి విరుద్ధముగానుండక జీవితాదర్శములతో సమన్వితమై యుండవలయునుగాన చరిత్రలోఁగాని, నాటకములలోఁగాని, నవలలలోఁగాని కథలు పాటలు పదములుమున్నగు వానియందుఁగాని దుఃఖపరిణామముగా నున్న జీవితమట్లే నిరూపింపవలయును. సుఖాంతము జేయుటకై భగవంతుని ప్రత్యేకముఁ దెచ్చిపెట్టి రక్షణయొనర్చుట స్వభావవిరుద్ధమని నాయాశయము.

ఆధునిక నాటకకవులలోఁ బ్రథమశ్రేణియందుండఁదగిన కోలాచలం శ్రీనివాసరావుగారు వ్రాసిన "రామరాజు" లేక "విజయనగర సామ్రాజ్యాంత" మనెడి నాటకము నిక్కముగ విషాదనాటకమే. కవీశ్వరుఁడు సంస్కృతనాటక నియమముల నుల్లంఘింపలేక సుఖాంతముఁ జేసినటు లెవ్వనికైనను దోఁపక మానదు. దుఃఖాంతముఁ జేయుట చరిత్రయందలి యథార్థమునకు సరిపోవును. ఏలయన యుద్ధరంగంబున రామరాజు మరణముతోఁ విజయనగరసామ్రాజ్యము గూడ మరణించినదను విషయము చరిత్రకారులు స్థిరముగఁ జెప్పినదే. రామరాజు తరువాత నతని సింహాసనము నధిష్ఠించినవారు లేరు. సామ్రాజ్యమును వెనుకటియుచ్ఛదశకుఁ దెచ్చినవారును లేరు. కాఁబట్టి రామరాజసుగుణములచేఁ బేరొందిన రాజ్యమతని యవగుణములచే శిథిలమొందెనుగావున దుఃఖాంత నాటకములకిదియొక గొప్పనిదర్శనమగును. ఆప్రకారము కవి తనగ్రంథమును ముగించినయెడలఁ బ్రపంచమందలి గొప్పదుఃఖాంత నాటకములకిది యీడుదీయకపోవును. "జూలియసుసీజరు" "కేటో" "గట్సువాన్ బెర్లిషింజను" మున్నగు మహావీరుల గురించి వ్రాయఁబడిన దుఃఖాంతనాటకములతోఁ దుల్యమై విరాజిల్లుచుండవలసినదే. అట్లుచేయక నూతననాటక మార్గదర్శియయ్యును సుఖాంతనియమమును దాటలేక యీగొప్పనాటకమునకుఁ దీరని కొఱంతఁ గలుగఁ జేసెను. ఆలోపమును దన సామాజికులు దీర్చినను కవీశ్వరుని ప్రతిభయందలి కళంకమట్లే

యున్నది. కాలేయుఁడైనను బాటాణుఁడు పితృమరణముగా
వించి బ్రతుకవలసినవాఁడా? తనయందు సంపూర్ణ విశ్వాస
ముగల తండ్రిని మతద్వేషముచేఁ గపటోపాయమునఁ జంపిన
దుర్మార్గుఁడు బ్రతికినయెడల నాయకుఁడగుట కెంతమాత్రమును
దగఁడు. కావునఁ దండ్రినిజంపిన కరవాలముచేఁ దాఁజచ్చు
టయే ధర్మము. అతఁడు జచ్చినయెడల నాతనికంటె నెక్కు
డభిమాన సాహసములుగల ఆషాబీ నిశ్చయముగ వీరస్వర్గము
నొందును. ఆలోచన మార్చి నిరూపించిన గ్రంథమే యుద్గ్రం
థమై యాంధ్రవాఙ్మయమున సత్కీర్తిప్రకాశముతో నెగడొందు
చుండును.

ఇట్లు చెప్పుటచే విషాదకథలన్నియు విషాదాంత
ముగనే కనుబఱుపవలయునని నాయభిప్రాయముగాదు. ఏకథ
నయినను దుఃఖాంతముగ రచింపవలయునా లేక సుఖాంత
ముగ రచింపవలయునాయను విషయమును నిర్ణయించుటకా
కథ దేశచరిత్రయందుఁగాని కర్ణాకర్ణికగాథలయందుఁగాని
యేరూపమును దాల్చియున్నదో ముందు దెలిసికొనవలసి
యున్నది. మోదాంతమగు నైతిహ్యముగాఁ గథాసాంప్రదా
యములోఁ జేరియున్నయెడల దానిని విషాదాంతముగఁ జేయ
వలను పడదు. హరిశ్చంద్రుని గాథ విషాదాంతముచేయు టెట్లు?
పరమేశ్వరునిచే లోహితాస్యుఁడు బ్రతికింపఁ బడెననియు,
చంద్రమతియందు ఖడ్గనిహతి పుష్పమాలాకృతి నొందెనని
యుఁ బురాణము ఉద్ఘోషించుచుండఁగా మన మెట్లుమార్పఁ
గలము? అట్లు మార్చుట యనుచితము నధర్మమునుగాదా?

శ్రీనివాసరావుగారికి సమకాలికుఁడై, సహవాసియై, సహాధ్యాయియై యాయనవలె ననేకాంధ్రనాటకముల రచించి పెక్కుండ్రచే నాంధ్రనాటక పితామహుఁడని యెన్నికఁ గాంచిన ధర్మవరము కృష్ణమాచార్యులువారు 'విషాదసారంగధర' మను పేరను సారంగధరనాటకమును దుఃఖాంతముగ వ్రాసినారు. సారంగధరునికథ మనము వెనుకటి గ్రంథములలో దేనియందుఁ జదివినను సుఖాంతముగనుండెనుగాని దుఃఖాంతమును బొందియుండలేదు. పదునాఱవశతాబ్దమునఁ బ్రబంధరూపమునఁ జేమకూర వేంకటకవి వ్రాసిన సారంగధరచరిత్ర సుఖాంతముగనేయున్నది. పదునెనిమిదవశతాబ్దములోఁ గూచిమంచి తిమ్మకవి వ్రాసిన సారంగధరచరిత్రమనెడి ద్విపదకావ్యములోఁ గూడ నట్లేయున్నది. మఱియు యక్షగానములలో సైతము మోదాంతమే. కర్ణాకర్ణికగా వచ్చుచుండుసన్నివేశమందును సారంగధరుఁడొకానొక సిద్ధుని చికిత్సాక్రియలచే నంగవైకల్యము తగ్గి పునర్జీవితుఁడయ్యెనని తెలియుచున్నది. ఇట్లుండఁ గృష్ణమాచార్యులుగారు సారంగధరుఁడు మరణించినట్లు వ్రాయుట కేవలము చరిత్రకు విరుద్ధమైనది. చరిత్రకు విరుద్ధమగుటచే యథార్థమునకు దూరమగును. యథార్థమును దప్పించుట కల్పనకొక గొప్పకళంకము. కావునఁ గృష్ణమాచార్యులువారు శ్రమఁజెంది నూతనమార్గమున వారొనర్చిన కార్యము సమంజసముగాదనియు సంస్తవనీయముగాదనియు నేఁజెప్పసాహసించుచున్నాను. సారంగధరనాటకమున్ను

దుఃఖాంతముగఁ జేసినచో వీరబొబ్బిలినాటకమునుగూడ దుఃఖాంతముగఁ జేయఁగూడదా? అట్లుజేయుటయు దేశచరిత్రకు వ్యతిరేకమే. ఏలయన బొబ్బిలివీరుల రుధిరధారలచేఁ దడిసిన సంగరాంగణము తడియాఱకుండగనే బాలుని వేంకటరాయుని పితృపైతామహసింహాసనమున బూసీదొర యాసీనునిగఁజేసెనని బొబ్బిలికథయందుఁ జరిత్రకారులు జెప్పియున్నారు. ఆహేతువుచే వీరబొబ్బిలికథ రంగారాయమరణముచే దుఃఖసమగ్రమైనను వెనువెంటనే కలిగిన రాజకీయపరివర్తనముచే సుఖాంతమయ్యెనని చెప్పనలసివచ్చినది. కావున నేకథనైనను నిర్హేతుకముగ నిరాధారముగ ఖేదాంతము జేయుటకుఁ గవి కధికారములేదు.

అనేకశతాబ్దములనుండి జాతిమతసంరక్షణకొఱకేమి, దేశసంరక్షణకొఱకేమి రక్తధారలలో మునిఁగి యసువులఁ గోల్పోయిన మహావీరులగు స్త్రీపురుషుల చరిత్రలతోఁ బరిపూతమైన పుణ్యభూమియగు నీభారతవర్షంబున నిజమగు విషాద చరిత్రలకేమికొఱవు? మలిక్కాఫరుతోఁ బోరాడి రణరంగంబునఁ బ్రాణముల విడిచిన దేవగిరిప్రభువగు రామదేవుని చరిత్రము లేదా? పరదేశీయులగు శకశత్రు దళములతోఁ బోరాడి కదనరంగంబున వీరస్వర్గమును జూఱగొనిన భోజమహారాజు చరిత్రము లేదా? అక్బరుపాదుషాసేనల యుద్ధతి కోహటించుచు నడుముగట్టి పురుషవేషముదాల్చి కత్తిచేఁ బూని మొగలాయిసేనలతోఁ బోరి ప్రాణములవిడిచిన యహ

మద్దగిరిరాణియగు చాందుబీబీచరిత్రము లేదా? మానసంర క్షణార్థమై యల్లాయుద్దీనుతోఁ బోరియు తుదిలో నగ్నిఁబడి కీర్తిఁ గాంచిన రాజదంపతులగు పద్మినీభీమసింగుల చరిత్రము లేదా? ఇట్లనేకములగు నుద్రేకపూరితములగు మహనీయుల జీవితములు మనదేశచరిత్రయందుఁ గలవు. ఇంక సాంఘికజీవితములందైనను నాదర్శభరితములైన చరితములుగూడఁ గానుపించుచున్నవి. భర్తకొఱకు ప్రాణములర్పించి పాతివ్రత్యమును నిల్పిన కామమ్మకథ లేదా? అత్తగారియొక్కయు నాఁడుపడుచులయొక్కయు ననసూయాపూర్ణములగు బాధలపాలై యున్న “ఒథెల్లో” చేత “డెస్డిమోనా” హత్యఁ బొందినట్లు తన భర్తచేఁ జంపఁబడిన లక్ష్మమ్మ లేదా? ఇట్టి ఘట్టములెన్నియో మన దేశమందుఁ జరిగినవే. ఇవి దుఃఖాంతనాటకములకనువగు విషయములుగావా? ఈకథలను గ్రహింపని యీ మహానుభావులుఁ గైనను వ్రాసినయెడల నాంగ్లేయవాఙ్మయములో నుండి మనవారిచే ననవరతము గొనియాడఁబడుచున్న “ఒథెల్లో” “జూలియసుసీజరు” “ఆంతొనిక్లియోపాత్రా” మున్నగు మహాదుఃఖాంత నాటకముల కీసుమంతయేని తీసిపోవునా? కావున నాటకకథలకొఱకు మనదేశచరిత్రలను బరిశోధించుచున్న బాలకవులును వృద్ధకవులును నిట్టి ఘట్టముల నాదరించి తమ కవితాపటిమచే శోభిల్లఁజేసి శోకరసనాటకములను దుఃఖాంత నామముగనే వ్రాసి జనసముదాయమునందుఁ గాలోచితభావములను మేల్కొలుపుటయు మానవజీవితమునందలి త్యాగాద్యు

తత్కృష్టాదర్శములను వెదజల్లుటయు, నాంధ్రనాటక తేజస్సును ప్రపంచనాటక ప్రభాపుంజములోఁ బ్రసరింపఁజేయుటయు నొనరింతురుగాక !!!

5 నాటక ప్రదర్శనము.

శ్లో॥ ఆపరితోషాద్విదుషాం
న సాధుమన్యే ప్రయోగవిజ్ఞానం।
బలవదపిశిక్షితానా
మాత్మన్యప్రత్యయం చేతః॥

[కాళిదాసు]

ఆంధ్రనాటకప్రదర్శనము మన తెలుఁగుదేశములో ననేక ప్రాంతములయందు ననేకరీతులుగా నున్నది. ఒక దిక్కునందున్న ఫక్కీ మఱియొకదిక్కున లేదు విశాఖపట్టణమువైపు నొకమాదిరియు, గోదావరి, కృష్ణా, గుంటూరు ప్రాంతముల మఱియొకతీరును నెల్లూరుమండలమున నింకొక

పద్ధతిని, బళ్ళారిలో మఱియొకవిధమును ఇట్లు తెలుఁగుదేశములో నానాదిక్కుల నానావిధముల నాటకప్రదర్శనములు జరుగుచున్నవి ఈభేదములు సామాన్యముగ నాల్గుగాదు తెఱగతులక్రింద విభాగింపవచ్చును, అవేవన:—

(1) Scenery (తెరలు).

(2) వస్త్రధారణము.

(3) సంగీతము.

(4) అభినయము.

ఏనియందలిభేదములు సామాన్యముగ నాయాస్థలములయందున్న భాషాభేదములు, ఆచారవ్యవహారభేదములంబట్టి కలుగుచున్నట్టుల సూక్ష్మదృష్టికి గోచరమగును. ఈభేదముల సూక్ష్మవివరణ మిచ్చుట యనావశ్యకము. స్థూలీపులాకముగాఁ గొన్నిఁటి మాత్రము క్రిందవివరించి, తద్విషయములలో నాయభిప్రాయమునుగూడఁ జెప్పెద.

పురాతనకాలమునుండి వీధినాటకములు, భాగవతులు మనదేశములో నాడఁబడుచుండుట వాడుక. ఇప్పటికాలమందాంగ్లేయ సంసర్గముచే నాటకములయందు నూతనపద్ధతులు వృద్ధినొందుచున్నవి. మొట్టమొదట నాటకప్రదర్శనము పార్సీ మరాటీ నాటకప్రదర్శనముల మాదిరిగఁ బ్రారంభింపఁబడిన విషయమెల్లఱకుఁ దెలిసినదే. దీనికిఁగాను శాశ్వతమైన నిదర్శనములు కృష్ణమాచార్యులుగారును, శ్రీనివాసరావుగారు ప్రభృతులు వ్రాసినపాటలే. అవి పార్సీమట్లమీఁదను .

వ్రాయఁబడుటయు, పార్శ్వస్వరములతోఁ బాడఁబడుటయు నిప్ప టికినిజరుగుచున్నది. ఈపాటలును, ఈమట్లును మననాటకచరిత్ర మునెల్లకాలము వేనోళ్ళఁజాటుచునే యుండును. బొంబాయి కంపెనీయును, బలవంతరావుకంపెనీయును, మనదేశములో జాలకాలమువఱకు సంచారములుచేసి నాటకప్రదర్శనమందు మనవారికిఁ గొంతయభిరుచిఁ గుదిర్చినవి. అంతకంతకుఁ గ్రమ ముగా మనప్రదర్శకశిఖామణులు జాతీయబంధనముల విడ నాఁడి యాంధ్రనాటకమున కాంధ్రత్వమును దెచ్చుచున్నారు ఇప్పుడు దేశమందన్నిచోట్లాంధ్రత్వనిరూపణమందు హెచ్చు తక్కువలు కాన్పించుచున్నవి; గానివిజాతీయవిదేశీయాను కరణోత్సాహములయందు వైముఖ్యమేయున్నది. ఇది కడు సంస్తవనీయమైన విషయముగాదా!

1 దృశ్యజాలము (Scenery)

మన నాటకశాలలయందు నవనికాదిదృశ్యజాలము మనదేశమందలి చిత్రలేఖనముతోఁబాటు విదేశీయవస్త్వను కరణముగానుండెడిది. క్రమక్రమముగా దేశీయప్రకృతి మన వృత్తులయందుఁ బెరిఁగినకొలఁది విదేశీయాభిమానము తగ్గుచు వచ్చెను. ఇప్పటికిని నెల్లూరుపురమందిరమున నున్న నాటక రంగస్థలమున ముందు వ్రేలాఁడుచున్న తెర విదేశీయ చిత్ర పటమే. అది యీజిప్టుదేశాధిరాజ్ఞియగు క్లియోపాత్రా తన సిగ్రో చెలికత్తెలతో వినోదించుచున్న తీరుగఁ గాన్పించు చున్నది. మనచిత్రలేఖకు లిప్పటికి దేశీయవిషయములను

సభక్తికముగ గమనించి దేశీయచిత్రలేఖనమును వృద్ధినొందించుచున్నారు. రవివర్మ తిన పటములయందు మన పురాణకధలను జిత్రించియుండుటచే దేశీయులెల్లఱకు మార్గదర్శకుండయ్యెను. అవిద్యైనను విదేశీయ సంసర్గము కేవలము విడువలేదనియే కొందఱి మతము. వంగదేశమునందు వంగీయచిత్రలేఖన ముద్ధరింపఁబడినటుల మన యాంధ్రదేశమందును మనదేశప్రకృతికి సరిపోవునొక నూతనకళపొడసూపుచున్నది. అయ్యది ముఖ్యముగా బందరు, రాజమహేంద్రవరపట్టణములలోఁ బ్రారంభింపఁబడినది. బందరులోనున్న యాంధ్రజాతీయకళాశాలయందును రాజమహేంద్రవరములో కీర్తిశేషులయిన దామెర్ల రామారావు ప్రభృతులచేతను నాంధ్రదేశీయ జిత్రలేఖనాకళ వెల్లడిఁజెందినది. అదియింకను బ్రత్యేకాంధ్రవ్యక్తిని బ్రత్యక్షముగా సగౌరవముగాఁ జూపుటలేదు. కాని యట్టి భావిపరిణామమునకు మార్గదర్శినిగానున్నది.మన నాటకశాలాధికారులీ నూతన కళాద్యోతకులగు చిత్రలేఖకుల సహాయముఁ జేకూర్చుకొని, తమరంగస్థలముల దేశీయచిత్రపటములతో నలంకరింపవలసి యున్నది. దేశీయప్రకృతి వర్ధిల్లినకొలఁది దేశవ్యక్తి విస్తరిల్లునుగదా!

[2] వస్త్రాద్యలంకారములు.

వస్త్రాద్యలంకారములయందు మననాటకుల కౌచిత్యము కంటెఁ జాపల్యము హెచ్చు. మణిస్థగితభూషణములును,

అమూల్యవసనములును, సామాన్యముగ ధరించెడి మన స్త్రీ పురుషులు నాటకరంగస్థలమునఁ గూడనట్టి విలువగల వస్త్రము లు ధరించుట సహజమే. అంతియగాక సామాన్యముగ మననా టకములోని నాయికానాయకులు రాజవంశములకుఁ గాని, దేవగణములకుఁగాని చెందినవారగుటచే నవనిధులు వారి యరచేతులలోనే యుండును. అట్టివారెంతవిలువయిన వేషము వేసికొనినను సమంజసముగానుండును. కాని నిరాడంబరము, నిర్ధనమే ముఖ్యజీవికగా నుండఁదగిన లోకోత్తరులగు ముని పుంగవులు కూడ ముకముల్పట్టుకోటులను, మెచ్చుబంగారము కోటులను బోల్లాడుట హాస్యాస్పదము. ఒకానొక పల్లెటూరి నాటకసమాజములో నారదపాత్రమునుధరించిన యువకుఁడు పట్టుషరాయియును, సరిగకుట్టులకోటును నిచ్చినఁగాని రంగ స్థలమునకు వెళ్ళననిపట్టుబట్టెను. పీఁచుగెడ్డము, నెత్తిని జడలనం టించుకొని కోటుషరాయులఁదొడిగికొనిన నావేషమెంతరమ ణీయముగ నుండునో ప్రేక్షకులే గ్రహింతురుగాక! నారదుడు కాకపోయినను నబీసాహేబువలె నుండును. ఇట్టి పిచ్చిపోకల కంటె నుచితజ్ఞతయుండిన నెంతమనోజ్ఞముగానుండును? ఏకా లపుపాత్రమున కాకాలపు వేషమును, యేదేశపుపాత్రమున కాదేశపువేషమును ధరించుట స్వతస్సిద్ధము, నిరాక్షేపణీ యము, మనోహరము. మన యాంధ్రదేశమున నుచితమైన వస్త్రధారణము మన గ్రంథములయందచ్చటచ్చటఁ గాన్పిం చుచున్నయది. మనుచరిత్రయందలి మాయాప్రవరుని వేష

మును వర్ణింపుచు పెద్దన యాంధ్రబ్రాహ్మణవతంసునివేష మును వర్ణించెను.

సీ. అర్ధచంద్రుని తేట నవఘళించు లలాట
పట్టెఁదీర్చిన గంగమట్టితోడ
జెక్కుటద్దములందు జిగివెల్లువలుచిందు
రమణీయ మణికుండలములతోడ
బసిఁడివ్రాతచెఱంగు మిసిమిదోపఁజెలంగు
నరుణాంశుకోత్తరీయంబుతోడ
సరిలేనిరాకట్టు జాళువాముల కట్టు
బెడగారు నీర్కావిపింజెతోడ
గీ. ధవళధవళములగు జన్నిదములతోడఁ
గాశికాముద్రయిడిన యుంగరముతోడ
శాంతరసమొల్కు బ్రహ్మతేజంబుతోడ
బ్రవరుఁడయ్యె వియచ్చరప్రవరుఁడపుడు.

[మనుచరిత్రము.]

రాజవేషమునుగురించి యిట్లుజెప్పబడినది:

శ్రీకృష్ణుని వర్ణించుచు ముక్కుతిమ్మన్న యిట్లుఁ జెప్పెను.

"వెన్నెలనిగ్గులు వెదచల్లెడుమడుంగు
లందిచ్చెనొక్క పూర్ణేందువదన"

[పారిజాతాపహరణము.]

ఆ॥2.

శ్రీరామునిగురించి:

"హారకేయూరవలయు శిరోభూషణములొప్పార
రఘురాముఁడు సర్వవైభవాలఘుజనమనోభిరాముఁడయ్యె"
[అధ్యాత్మరామాయణము]

"క్షోమలచారుదుకూలంబు వెడలించి
కర్కశవల్కాంశుకములుగట్టె.
[భాస్కరరామాయణము.]

రాజవేషమునందు దువ్వలువలుకట్టె యంగీలఁ దొడిగినటులేయున్నది కాని షరాయులుధరించినటులెక్కడను కానరాదు. తిరుపతిదేవాలయములో శ్రీకృష్ణదేవరాయలయొక్కయు, వేంకటపతిరాయలయొక్కయు, నిత్తడివిగ్రహములలో బంచకట్టు కాన్పించు నేకాని షరాయితొడిగినట్లులేదు. కనుక షరాయిఁదొడుగుట మన దేశాచారము కాదనియు ప్రాయశః ప్రాచీనాచారము కాదనియు నాయభిప్రాయము. తజ్ఞులు సహేతుకముగా దీనిని ఖండించినచో నాతప్పు సవరించికొనియెదను. కావున నిట్టివేషములు మనకు నైసర్గికములై యుండ మహారాష్ట్రకుళ్లాయులు,బంగాళీటోపీలును, తురకషరాయిలును, మనవారంవముకొఱకు వేసికొనుట పామరజనాకర్షణహేతువుగానున్నను సుచితజ్ఞులకు హాస్యజనకముగానే యుండును. జో చిత్యమును మించినవేషము దోషమే.

3 సంగీతము.

నాటకములలో నటీనటులు పద్యములఁజదువుటలో సంగీత మెంతవఱకు వాడవలెనో యను నంశమునుగురించి యనేకవిమర్శకులు భిన్నాభిప్రాయములనిచ్చియున్నారు. ఈ విషయమును నేను ప్రథమముననే చర్చించితిని. రసోద్రేకము గలిగించి, తన్మూలముగాఁ బ్రజలకు నీత్యుద్బోధనముఁగావించుటయే నాటకముయొక్క ముఖ్యోద్దేశము గాన నట్టి రసోద్రేకముఁ గావించెడి సుసాధనము లన్నియు నాటకములయందు వాడఁదగినవే. అట్టి సాధనములయందు సంగీతాభినయచిత్రలేఖనములు ముఖ్యములైనవి. కావున వీనినన్నిఁటిని నాటకరంగములయందుచితరీతిని బ్రయోగింపఁదగును.

నాటకరంగము సంగీతసభ కాదని యెఱుంగనగును. సంగీతసభయందు కేవలము సంగీతశ్రావ్యైభవమే వినియానందింతుము. నాటకరంగమందు నాటకప్రకృతియొక్క భావావేశ్నలనముఁ జూచియానందింతుము. అట్టిభావావేశ్నలనమునకు సంగీతమొక్క యుపసాధనము; గాననంతకంటెదానికెక్కువ ప్రాముఖ్యతనీయఁగూడదు. భావప్రకటనకు సంగీత మెంతవఱకుఁగావలెనో యంతయే జూపఁదగినది. అంతకంటెనెక్కువగా సంగీతమాలాపనఁజేసి పద్యములయొక్క యర్థమును, భావమును సంగీతచాతుర్యమునందు మఱుఁగుపెట్టినయెడల నట్టి పాత్రము సంగీతవిద్వాంసుఁడనిపించుకొనును కాని మహానటుఁడనిపించుకొనఁజాలఁడు.

పాటలుపాడుటయందేకాక పద్యములుజదువుటయందుఁ గూడ సంగీతముపయోగింపవలసిన కారణము వేఱొండుకలదు. తెనుఁగుభాషయొక్క ప్రకృతియే స్వరమాధుర్యము. అందు చేతనే సంగీతశాస్త్రముయొక్క యభివ్యాప్తికిది యెంతయో యుపచరించుచున్నది. అట్టిభాష మనకు మాతృభాషయయ్యె భాషయందలి పద్యములను స్వరనియమము లేకుండఁ జదువ గాఁజదివినయెడల భాషాప్రకృతిని చంపినవారమగుదుము. ఈ రెండుకారణములచేతను తెనుఁగుపద్యములు చిత్రమగు రాగ ధోరణిలోనే చదువబడెను. కాని యారాగములుమాత్రము పద్యమునంతయు నావరించి ముంచివేయఁగూడదు.

సంగీతనాటకసాంప్రదాయమందు నెఱిఁగినవారైనవారుఁ జాల కాలమునుండి నెల్లూరిసామాజికులగ్రస్థానమునుండియున్నా రు. వారుపైఁజెప్పిన నియమములఁ బాటించుచు నాటకప్రదర్శన మును గడు రమణీయముగఁ జేయుచుండిరి. సంగీతమునందు విద్వాంసులున్నను వారు తమ ప్రాగల్భ్యమును గొంతవఱకు సంతరించికాని పద్యములందలి భావప్రకటనము స్పష్టముగాను బహుమనోహరము గాను జేయుచువచ్చిరి. కాని కృష్ణాగోదా వరీలయందును, బళ్ళారి ప్రాంతములయందును, మొన్న మొ న్నటివఱకు సంగీతముయొక్క యార్భాటమే నాటకములయొ క్క ప్రాశస్త్యపు బిరుదుగా యోచింపఁబడినట్లు గాన్పించు చుండెను. ఒక్కొక్క పద్యముతో నిలుపులుపెట్టిన రాగముద్వా నిత్యము ముగియవలసినదే. పద్యముపూర్తియగువఱకు సుమారు

రగంటు పట్టును. సగము కాలము పద్యము తక్కిన సగము కాలము రాగముయొక్క యాలాపనము. ఒకానొకసమయమున చప్పట్లు కొట్టువఱకు నాలాపనము జరుగవలసినదే. ఈపద్ధతి యిపుడుమన్నపుడు గొంత తగ్గినది గాని బళ్ళారి ప్రాంతముల యందుఁ దగ్గినటులఁ గాన్పింపదు. నాటకవిధానములో సగ్రస్థానముఁగన్న బళ్ళారియందీ లోపము తగ్గకపోవుటజాలవిచారకరము.

4. అభినయము.

సంగీతము వలెనే యభినయమును గూడ నౌచిత్యనియమపు కట్టుఁగట్టములలో నుంచవలెను. మననాటకులు భరతశాస్త్రమునంతయుఁ జదువవక్కఱలేదు. అది సర్కసులలామములవని; గాని వేశ్యావనితలవలెనే కొంతమంది నటులు ప్రతిశబ్దమునంటు నభినయముఁ గన్పఱచనిచో మెడల లోపమని తలఁచుచుండురు. ప్రతిమాటను చ్చరింపుచుఁ జేతినో కాలినో కంటినో త్రిప్పుచుండురు. ఆనృత్యము భోగము మేళమువలె నుండును, గాని నాటకమువలెఁ గాన్పింపదు. బళ్ళారి టి. రాఘవాచార్యులుగారు, నెల్లూరు నాగరాజారావుగారు, రాజమహేంద్రవరము జగ్గరాజు గారు మున్నగు మహానటుల యభినయముఁ జూచినఁగాన్సేతులకంటె ముఖదృష్టియందే యెక్కుఁ వభినయముండుఁ దగినదనియు, స్వరభేదముచే భావవికారములు ముఖ్యముగానిరూపింపఁబడఁ దగినవనియుఁ దెలియవచ్చును. రంగస్థలమంతయుసడుసుఁద్రిక్కు నటులఁద్రొక్కుట యిపుడంతగాఁ-

బట్టిణములయందుఁగాన్పింపదు. కాని శృంగారరసము వెలువడు చుటలో మాత్రము పిచ్చిపిచ్చిహాస్యవిన్యాసములేగాక పేఁటిడివలె గంతులు వైచుటగూడఁ దఱచు గాన్పించుచుండును. అనాటకులే ప్రేక్షకులలోఁ జేరి యిట్టికృత్యములను జూచిన వెుడలఁ జాలసిగ్గందుదురనినానమ్మకము. ఈవిషయములో షేక్స్పియరు మహాకవి చెప్పినదానికన్న నెక్కువ చెప్పుటకవకాశములేదు.

"Do not saw the air too much with your hand, thus, but use all gently; for in the very torrent, tempest and, as I may say, the whirlwind of passion, you must acquire and beget a temperance that may give it smoothness."

"గాలిని అంపములతోఁ కోయుచున్నట్లుగా చేతులను నిరంతరముఁ ద్రిప్పక, నెమ్మదిగాను, శాంతముగాను అభినయింపుము. ఏలయన, రౌద్రభయానకరసము లుద్వేలములయి, ప్రళయాభీలకల్లోలములవలెను, ప్రచండ మారుతములవలెను, కోలాహలము బొందుచున్నను నీవు చిత్తవిభ్రమణము బొందక, ఔచిత్యమును, పరిమితిని పాటించి, మృదులమగు రీతిని నిరూపింపుము"

ప్రతిదేశములోను ముఖ్యముగా మనహిందూదేశములో స్త్రీలెక్కువశాంతచిత్తులుగను అడఁకువ, నమ్రతఁగలిగిన వారుగనునుందురని యందఱొప్పుకొనినవిషయమే. అందులోఁ బ్రాయశః గొప్పకులమునందుఁ బుట్టినస్త్రీలుమఱింతయెక్కువ వినయముగానుండురు. అట్టివిషయములో నున్నతకులజులగు

స్త్రీలననుకరించెడి స్త్రీపాత్రములు రంగస్థలమునందుఁ జేతు లందిప్పికొనుచు గంతులువైచుచుఁ బురుషులతో సరసస్లా పములాడుటఁ జూచిన నా స్త్రీలు కులీనులా కులటలాయను సందేహము ప్రతివానిమనమునందుఁ బుట్టించుచుండును. ఇట్టి శృంగారరసప్రదర్శనము దాసరులాడెడి తోలుబొమ్మలాటనలెఁ గాన్పించునుగాని సరసమగు నాటకప్రదర్శనముగనుండదు.

పామర జనాకర్షణమునకో లేక జీవితచరిత్రముల యొక్క ప్రతిబింబిత సాధనమునకోయన నిప్పుడిప్పుడు మరణము హత్యమొదలగు ఘోరప్రదర్శనములను రంగస్థలములఁ గనుపఱచుట జరుగుచున్నది. ఇట్టి భయావహములగువిషయములను జూపఁగూడదని ప్రాచీననాటకనిర్ణేతలుఖండనముగాఁ జెప్పియుండుటయు, మహానాటకకర్తలా నిబంధనముల నతిక్రమింపకపోవుటయు బహుళిగ్రంథవేత్తలెఱింగిన విషయమే. ఈకాలమునందుఁ బ్రాచీనాచారములను, ప్రాచీన నియమములను బూర్వపక్షము జేయుటయు, సంస్కరణయోగ్యములగు వానిని సంస్కరించుటయో, లేక నతిక్రమించుటయో విధాయకముగ నున్నను గొన్నివిషయములుమాత్రము మానసజీవిత పారిశుద్ధ్యముకొఱకు సర్వదాయనతిక్రమణీయములు. అట్టివిషయములలో నిదియొకటి. ఘోరప్రదర్శనములు కేవలము భయావహములయి జుగుప్సాకరములయి నాటకదర్శనాకౌతూహలమును జాలవఱకుఁ దగ్గించును. మానవహృదయములయందు సహజకారుణ్యభావముల శుష్కింపఁజేసి కాఠి

న్యమును గలుగఁ జేయును. నాటకములయొక్క ముఖ్యోద్దేశమట్టి పరిణామము కలుగకుండుటయే. ఇట్లుండఁ బరిపక్వాంతఃకరణ ప్రబోధకములగు నాటకములును నాటకరంగస్థలములును ఘోరకార్యకరణ ప్రచురణములుగఁ జేయుట నాటకవిషయ యముగాని వృద్ధిసాఫల్యముగాదు—

కావున నో మహనీయులగు నాటకప్రదర్శకులారా? నటీనటవతంసములారా? మానవజాతియొక్క నీత్యుద్బోధ నమున కుత్పత్తిసాధనములయిన నాటకములను కేవలము ద్రవ్యాకర్షణముకొఱకు, నీచక్రీడాసంతుష్టికొఱకు నింద్యమార్గ ముల నడిపింపక పరమపావనపథములఁబట్టి ప్రదర్శింపుచు మీరు జన్మసాఫల్యము నొంది దేశమునందుఁ జిరకీర్తనీయు లగుదురుగాక!

ఉపసంహారము.

-:(o):-

నాటకములయుత్పత్తియు, వాని నిర్మాణము, కథారచన, పాత్రపోషణము, ఇత్యాదివిషయములగురించి నాకుఁ దోచినరీతిని బ్రసంగించితిని. ప్రస్తుతము జర్చింపఁబడుచున్న విషయములఁగూర్చికూడ వాదప్రతివాదములఁజూపి నాయభిప్రాయములను సహేతుకముగఁ గనపరచితిని. ఈవిషయములఁ

గూర్చి యింతపరిశ్రమ జేయుటకుఁగారణ మేమన—ప్రజాబోధనమునకు నాటకములొక ముఖ్యసాధనమని నాకుఁగలిగిన దృఢమైననమ్మకము.

ప్రజలయందలి నీత్యవినీతుల నిర్ణయించుట కా దేశమందలి నాటకములే సాక్ష్యములని మహావిమర్శకులు జెప్పుచున్నారు. ప్రాచీనగ్రీకులయొక్కయు, రోమనులయొక్కయు సమగ్రమైన నాగరికతను ద్యోతకపరచెడి యాధారములా దేశములందలి ప్రాచీననాటకరాజములని చరిత్రకారులు చెప్పినయథార్థము. ప్రజలయొక్క గుణగ్రహణ పారీణతఁబట్టి యా దేశమందలి నాటకముల యుత్కృష్టతనిర్ణయింపఁబడును. కావున నాటకములను శ్రేయోమార్గముల రచించినయెడలఁ బ్రజలనుగూడ నట్టిమార్గముల నడపించుటయేయని నిశ్చయింపవచ్చును.

పూర్వకాలమున, నేదేశమందైనను నాటకములఁ జూచి సంతోషించినను, నాటకులమాత్రము ప్రజలునిరసించుట యాచారమయియుండెను. ప్రజాసంఘమందు వారికి గౌరవమైనపదవిలేదు. మొన్న మొన్నఁటివఱకు మన దేశమందు నిదేస్థితి. నాటకులకు జాయాజీవులని యొక పేరు. అనఁగా, భార్యలచేఁ బోషింపఁబడినవారు. ఆమాటయందు నింద్యార్థముగర్భితము. భాగవతపువాళ్ళని నాటకులను చులకదనముతోఁ బిలుచుట నిప్పటికిని వినుచున్నాము. ఇట్టి నిరసనవాక్యములకు నాటకులయందలి నికృష్టజీవనము ముఖ్యకారణమని నిష్పక్షపాతబుద్ధికిఁ దోఁపక మానదు. నాటకులలో స్త్రీపురు

షులు సంఘమందలి నీతికట్టుబాట్ల నతిక్రమించుటయు, దోష వర్తనముల సంచరించుటయు, మున్నగు కారణములచేఁ బ్రజలకు వారియెడల గౌరవములేక పోవుట సంభవించెను. బైరను మహాకవి (Byron) చెప్పినట్లు "Maidens like moths are ever caught by glare." అనఁగా యువతీమణులు శలభములవలెఁ గాంతిప్రభలకులోనయి భ్రమయుదురు. విద్యుద్దీప కాంతులును మృదుమధురసంగీత నిస్వనములును, సువర్ణమయాంబరభూషణములును, నర్తకీచంచలవిలాసములును, మున్నగు చిత్రభ్రమణవిశేషములతో నలరారు నాటకరంగస్థలములు యువతీయువకుల యుల్లంబుల మనోవికారములు జనింపకుండఁ జేయునట్లు? కావున నాటకులును, నాటకాధికారులును తమ స్వజీవితములయందుఁ గట్టుదిట్టములు జేసియు తిమ్మోసనిసితికార్యములు జేసినవారిని గఠినముగాశిక్షించియు నిత్యాదిపరిశుద్ధజీవితస్ఫురితములగు కార్యములు నిర్వహించినయెడల వారిని గురించి ప్రజాభిప్రాయములు మారఁగలవు. రంగస్థలములయందు శృంగారాదిరసముల వెలిబుచ్చుచున్నను సంఘజీవితములో యుక్తప్రవర్తకులై యుండవలెను. లేనియెడల వారికి పకీర్తియేగాక వారవలంబించిన వృత్తికిఁ గూడ నపయశస్సే!

ఇంగ్లాండు దేశమున నిప్పుడు గొప్పనటీనటులు బహుసమ్మానితములగు పదవులయందుండుటయు, గొప్పబిరుదములందుటయు వినుచున్నాము. వెనుకటికాలమందు గ్యారిక్కు, సిడ

న్సనున్నగువారు పేరుప్రతిష్ఠలకుఁ దెచ్చిన యీప్రవృత్తి నిప్పటి కాలమందు కీను, ఇర్వింగు మున్నగు నటావతంసులును, టెర్రి, జెన్నహోప్టు అను నటీతిలకములును నవలంబించి యంత కంటె గౌరవనీయమగు దశకుఁ దెచ్చిరి. వీరిలోఁ గొందఱు నైటు (Knight) బిరుదమును గూడఁ బొందియున్నారు.

అటులనే మనదేశమందు నయితము, మహావిద్వాంసులు, గొప్పగ్రంథకర్తలు, ఉన్నతోద్యోగులును మున్నగు వారు నాటకులుగానుండి యలంకరించుచున్న నాంధ్రనాటకరంగము నీసంస్థయందును, జ్ఞానవిజ్ఞానప్రబోధనమందును, నుత్తరోత్తరప్రవృద్ధిగా వెలయుచు నాటకప్రయోగములు ప్రజలచేతను, ప్రభుత్వమువారిచేతను మన్ననలనొందుచు ఆంధ్రనాటకసమాజములయొక్క కులశీలముల నాచంద్రార్కముగా సంరక్షింతురుగాక !!

శ్లో॥ వాగంగసత్త్వచేష్టా
చిత్రాభినయప్రయోగరచనచణః।
సంసారనాట్యనాయక
పురుషాకారశ్శివో జయతి॥ [అభినవగుప్తాచార్యస్య.]

ఓం !!!

శ్రీచింతామణీ ముద్రాక్షరశాల, రాజమండ్రి.

Errata.

Page.	Line.	For	Read.
1	4	మహాంసీయు	మహాసీయు
1	11	స్వతసిద్ధము	స్వతస్సిద్ధము
2	5	శుద్ధిసఱచుటయే	శుద్ధిసఱచుటయో
2	5	ఇతిహాన	ఇతిహాస
2	8	మహాంనీయుల	మహానీయుల
2	21	కర్తవ్యము,	కర్తవ్యము.
3	16	స్థలములయందు	స్థలమునందు
3	10	యందుకొన్ని	యందుఁగొన్ని
4	14	యందుపద్య	యందుఁబద్య
5	4	యందుకవిత్వ	యందుఁగవిత్వ
5	13	ప్రత్యయో	ప్రత్యయం
5	19	నుపయోగించి	యుపయోగించిరి
5	21	యందుకథా	యందుఁగథా
6	1	శైలియోనుండఁ	శైలిగోయుండఁ
6	10	యందుపురుషులు	యందుఁబురుషులు
6	17	కర్తవ్యమె	కర్తవ్యమే
6	18	నాయిక,	నాయిక.
6	21	చేయనొప్ప	చేయనొప్పు
7	3	నపుడుయెటు	నపుడెటు
7	15	సమ్మతించిన	సమ్మతించిన
7	15	విషయమె	విషయమే
7	17	వక్కాణించిరి	వక్కాణించిరి

8	2	అంగ్లేయులు	ఆంగ్లేయులు
8	3	నప్పుడుయెటు	నప్పుడెట్లు
8	6	స్థలములయందు.	స్థలములయందు
9	4	నేమి జేయిదగి	నేమి చేయఁదగి
9	౬	కధలను	కథలను
9	21	మాట్లాడుచూ	మాట్లాడుచు
	22	దగినటుగా	దగినట్లుగా
10	2	నక్కాణించితిన	నక్కాణించితిని
11	2	వర్ణనశమత్కృతులు,	వర్ణనచమత్కృతులు
11	5	inental	mental
11	5	ఆధ్ర	ఆంధ్ర
11	6	రాజుయుక్క	రాజుయొక్క
11	9	లాపాదితంబులగు	లాపాదితంబులగు.
11	10	గాన్పించును	గాన్పించును.
12	4	సంన్కృత	సంస్కృత
12	16	యనుభవము	యనుభవము
14	3	నపుడు డాంధ్ర	నపుడాంధ్ర
14	9	వేర్వేర	వేర్వేఱ
14	16	ప్రయోగించి యున్నారు	ప్రయోగింపఁబడి యున్నవి.
14	17	యథారూపముగా	యథారూపముగా
14	21	ప్రథమము	ప్రథమము
15	21	కొన్నిభాగములు	గద్యోపాఖ్యానమునఁ గొన్నిభాగములు

16	17	- గాక.	గాక !
16	17	విథానముసు	విధానమును
16	18	విద్వాసులు	విద్వాంసులు
16	20	పరిస్థితుల	పరిస్థితుల
20	18	బరిశోధించి	పరిశోధించి
22	16	సాధృశ్య	సాదృశ్య
24	22	పజ్ఞత	పరిజ్ఞత
37	23	లగము	గలము
39	19	కదనంగంభున	కదనదంగంబున
41	2	పుంజమలోఁ	పుంజములోఁ
42	2	యుక	యొక
42	16	దేశమలో	దేశములో
49	14	జేయ	జేయు
51	7	దదు	డదు

ఆంధ్రపదములు-పాటలు.

గ్రంథకర్త

టేకుమళ్ల అచ్యుతరావు, యమ్. ఎ., యల్. టి.,

వెల అ. 0—4—0.

(Approved by the Madras Text-book committee as suitable for libraries.)

అభిప్రాయములు:—

(1) రాయసం వెంకటశివుడుపంతులు ఎమ్.ఎ.,ఎల్.టి., గారు.

"మీరుపంపిన మీచే రచియింపఁబడిన "ఆంధ్ర పదములు-పాటలు' అను గ్రంథమును నందనపూర్వకముగ నందుకొం

టిని, [illegible]ము ఆంధ్రదేశమున వెలసిన, పాతివ్రత్యలు, సుశీలురు, శ[illegible]డు నగు కొందఱు స్త్రీలయొక్కయు, వీరాగ్రేసరులు, శైవభక్తులు, సౌభాగ్యవంతులు నగు కొందఱు పురుషులయొక్కయు చరిత్రలు, పౌరాణికగాథలు మున్నగునవి కొన్ని 'పదములు-పాటలు' రూపమున మనకు నేటివఱకు వచ్చుచున్నవి. ఆ 'పదములు-పాటలు' ఆయానాయకానాయికల గుణవిశేషములను, గాథలను, సృష్టివైచిత్ర్యములను ఉన్నవి యున్నట్లు స్వభావసిద్ధముగా వర్ణించుటకేగాక, గ్రంథప్రచురమునకు సాధనములంతగాలేని పూర్వకాలమున జనసామాన్యమునకు సులభముగ తెలియుటకును, ప్రచారమగుటకును పూర్వపు గ్రంథకర్తలెట్టి మార్గముల నవలంబించిరో తెలియుటకును సాధకములగుచున్నవి. ఈ 'పదములు-పాటలు'ను సాధారణముగ నూరూరదిరుగు బిచ్చగాండ్రును, కొందఱు స్త్రీలును, బాలురును పాడుచుందురు. అనేకవిధముల నత్యంతోపయుక్తములగు నీ 'పదములు-పాటలు' యొక్క ప్రచురమును బిచ్చగాండ్రకు, స్త్రీలకు, బాలురకును వదలివేసి కాలక్రమమున నాశనముగావించక వానిని స్థిరస్థాయిగా నుంచుటకు మీరు మీగ్రంథమున సూచించిన మార్గములన్నియు సమంజసములు; తప్పక యవలంబనీయములు.

చదివి యానందించుటకు పండితులకును, విద్యావంతులకును ప్రౌఢకావ్యములెట్లు ఆవశ్యకములో యట్లే సామాన్యజనులకానందమును గొలుపుటకు పూర్వపు 'పదములు-

ంబుచ్చిన యత్నంతము మిగుల కొనియాడఁ
గ్రంథమిట్టి రచనలను ప్రోత్సాహపర
చ్చును’’ రా.

---

2. కవికొండల వేంకటరావు, బి.ఎ.,బి.యల్.,గారు.

కడపటి పుటలలో నా కవితను గుఱించి ప్రశంసింపకుండి యున్న, ఈ చిన్నటి పుస్తకమునకు పెద్ద యుపోద్ఘాతమును నేను వ్రాసియుందును జానపదగేయ సారస్వతము నందు నాకంతటి యభిమానము. అవి పాడునప్పుడు గాని, వానిని గూర్చి ఎవ్వరేని ముచ్చటించు నప్పుడు గాని నా హృదయము ఉప్పొంగు చుండును. నిజముగ మ॥రా॥రా॥శ్రీ టేకుమళ్ల అచ్యుతరావు పంతులు ఎమ్.ఎ.,ఎల్.టి., గారిచే రచింపఁబడ్డ ఈ "పదములు-పాటలు" అను విమర్శన గ్రంథరాజము తెనుఁగుబాస కిత్తరిని చుక్కాని వంటి దనవచ్చును. [illegible] ఏత త్యాగయ్యాది తంబులను చక్కఁగ విమర్శించి, అందలి గుణగణంబులను తులఁదూఁచి నట్లుగ సరిఁజూచి సాధు శైలిని మనముందు నిసర్గ గానలహరీ వీచికల నద్దరి నుండి యొడ్డునకు దేలించుచున్నది. ఆంధ్ర మహాశయు లెల్లరు అందలి హెచ్చుతికను గమనింతురుగాక !

నర్సాపురం, క. వేంకటరావు, బి.ఎ., బి.యల్.

గ్రంథకర్త యితర గ్రంథములు.

1. ఆంధ్ర[illegible] [illegible] (వెల 0—4—0.

[illegible] సామ్రాజ్య[illegible] ఆంధ్ర [illegible] చరిత్ర—ప్రథమభాగము (తెలుగు) [illegible] నున్నది.

[illegible] సామ్రాజ్య[illegible] [illegible]ము, గ్రంథము. ఇది [illegible] [illegible] ముద్రితము. (ఇంగ్లీషు) [illegible] లో నున్నది.

ఈ పుస్తకములు [illegible] రాజమహేంద్రవరములో నున్న గ్రంథకర్తగారి [illegible] వలయును,